ఇంటర్వ్యూ



జిల్లా కలెక్టర్‌గా పనిచేయడం అన్నది ఐఏఎస్ కెరీర్‌లో అతి కీలకమైన కాలం. చదువుకున్న రోజులనాటి అభివృద్ధి కలలను సాకారం చేసుకునే అవకాశం. అన్ని రంగాలపై ఆధిపత్యం మాత్రమే కాదు, సమన్వాయం చేయడం కూడా అతి ముఖ్యం. అందునా ఎన్నికలను ఎదుర్కోవడం ప్రతి జిల్లా కలెక్టరుకూ ఒక సవాలు. సరిగ్గా సార్వత్రిక ఎన్నికల సమయంలోనే తిరుపతి జిల్లాకు రెండవ కలెక్టర్‌గా జి.లక్ష్మీశ బాధ్యతలు స్వీకరించారు. మారుమూల ప్రాంతపు పేదరైతు కుటుంబంలో నుంచి వచ్చిన నేపథ్యమే ఈయనకు ప్రాధాన్యాల దిశానిర్దేశం చేసింది. నలభై రోజుల పాటూ జిల్లాలోని అన్ని ప్రాంతాలనూ సందర్శించి, అవగాహన తెచ్చుకున్నాకే లక్ష్మీశ మీడియాతో మాట్లాడడానికి ముందుకు వచ్చారు. ఆంధ్రజ్యోతితో మంగళవారం ఆయన సంభాషించారు. తన అవగాహనను, అభివృద్ధి ఆలోచనలనూ పంచుకున్నారు. అందులోని ముఖ్యాంశాలు...

ఉపాధికి నిధి తిరుపతి జిల్లా

- కలెక్టర్ లక్ష్మీశ

ఉపాధి కోసం జిల్లా వైపు చూడాలి!

దేశంలోనే మరే జిల్లాలోనూ లేనన్ని ఉన్నత విద్యాసంస్థలు తిరుపతి జిల్లాలో వున్నాయి. ఐఐటీ, ఐఐఎస్ఈఆర్ వంటి జాతీయ ఉన్నత విద్యా సంస్థలు నడుస్తుండగా తాజాగా శ్రీసిటీ భాగస్వామ్యంతో సత్యవేడులో మరో ఐఐటీ మంజూరైంది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కలినరీ, ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజిటల్ టెక్నాలజీ వంటి సంస్థలు జిల్లాలో వున్నాయన్న సంగతి కూడా చాలామందికి తెలియదు. ఇంకా అనేక విద్యాసంస్థలకు తిరుపతి నెలవు. వీటికి తోడు రేణిగుంట వద్ద రెండు ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్లు, శ్రీసిటీ, మేనకూరు సెజ్‌లు, ఏపీఐఐసీ పారిశ్రామిక వాడలు అనేకం వున్నాయి. వీటిలో బహుళ జాతి కంపెనీలతో పాటు ప్రముఖ దేశీయ పరిశ్రమలున్నాయి. వీటిని ఉపయోగించుకుని ఉన్నత విద్య కోసం, ఉపాధి కోసం రాష్ట్ర యువత తిరుపతి వైపు చూసేలా కార్యక్రమాలు రూపొందించాల్సి వుంది. ఉదాహరణకు గతంలో నేను పార్వతీపురం ఐటీడీఏ పీవోగా వున్నపుడు అక్కడ నుంచీ విద్యార్థులకు శిక్షణ ఇచ్చి శ్రీసిటీలో ఉద్యోగాలకు పంపించాను. విద్యా ఉపాధి అవకాశాల కోసం యత్నించే యువతకు తిరుపతి జిల్లా గమ్యస్థానం కావాలి.

పులికాట్ దీవుల్లోని పిల్లలకు చదువు

శేషాచల, వెలిగొండ అడవులు, పులికాట్ సరస్సు, బంగాళాఖాతం తీరం, వలస పక్షులు, ఏనుగుల సంచారంతో కూడిన అభయారణ్యాలు... ఇలా జిల్లా అరుదైన పర్యావరణాన్ని కలిగివుంది. దీన్ని పరిరక్షించడానికి కృషి చేస్తా. మారుమూల ప్రాంతాలు, సముద్రతీర ప్రాంతాలు, పులికాట్‌లోని దీవులు వంటి చోట్ల పిల్లలకు ప్రాథమిక విద్యనూ, ప్రజలకు వైద్యాన్నీ అందించడంపై దృష్టి పెడతా. సాగునీటి వనరులు అందుబాటులో వున్న తూర్పు మండలాలు గోదావరి డెల్టాను తలపిస్తున్నాయి. వ్యవసాయ పథకాలు సమర్థంగా అమలుపరచడం ద్వారా ఈ ప్రాంతాల్లో రైతు కుటుంబాలకు మేలు చేసేందుకు ప్రయత్నిస్తా.

పర్యాటక జిల్లాగా అవకాశాలు

ఆధ్యాత్మిక కోణానికి మాత్రమే పరిమితమైన తిరుపతిని భిన్న కోణంలో దేశానికి చూపాల్సిన అవసరముంది. తిరుపతికి వచ్చే వారిలో 80 శాతం మంది తిరుమల శ్రీవారిని దర్శించుకుని తిరిగి వెళ్ళిపోతున్నారు. కేవలం 20 శాతం మంది మాత్రమే కాణిపాకం, శ్రీకాళహస్తి ఆలయాలకు వెళ్తున్నారు. జిల్లాలోని షార్, పులికాట్ సరస్సు, నేలపట్టు పక్షుల కేంద్రం, బంగాళాఖాతం సముద్ర తీర ప్రాంతాలు, అనేక జలపాతాలు, పారిశ్రామిక కేంద్రమైన శ్రీసిటీ, శ్రీకాళహస్తి కలంకారీ, వెంకటగిరి చేనేత, జరీ చీరలు... ఇలా భిన్న కోణాలను బయటి వారికి తెలియజేయాల్సి వుంది. ఇందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసుకుంటాం.

ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్‌పై దృష్టి

కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమంలో తిరుపతి అర్బన్, తిరుపతి రూరల్, చంద్రగిరి, రేణిగుంట, ఏర్పేడు, గూడూరు తదితర మండలాల నుంచీ భూ ఆక్రమణలు, ప్రభుత్వ భూముల కబ్జాలు వంటి ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయి. తిరుపతిలో ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ ఉందన్న సంగతి కూడా ప్రజలకు పెద్దగా తెలియడం లేదు. సెల్ కార్యకలాపాల గురించి సమీక్షించాల్సిన అవసరముంది. ఎన్నికలు ముగియగానే ఆ విభాగాన్ని బలోపేతం చేస్తాం.

ఉపాధి నిధులతో భూగర్భ జలరక్షణ

ఉపాధి హామీ పథకాన్ని చెరువులు, కుంటలు, కాలువల్లో పూడిక తీతకు, ఊట కుంటల నిర్మాణ పనులకు వినియోగించుకుంటాం. భూగర్భ జలాలను పెంచడం ద్వారా పర్యావరణం మెరుగుపడేలా చూస్తాం. అధికారుల నుంచీ అందిన ఫీడ్‌బ్యాక్ ప్రకారం ఈ వేసవిలో తాగునీటికి ఇబ్బంది లేదని భావిస్తున్నాం. తిరుపతి, తిరుమల అవసరాలకు నీటి నిల్వలను అట్టిపెట్టుకోవడం జరుగుతోంది.

చివరి దశలో ఓటరు క్లెయిమ్‌ల పరిష్కారం

ఓటరు జాబితాలో సవరణలకు సంబంధించిన క్లెయిమ్‌ల పరిష్కారం తుది దశకు చేరుకుంది. ప్రస్తుతానికి 11 వేల క్లెయిమ్‌లు పెండింగులో వున్నాయి. 5500 క్లెయిమ్‌ల పరిష్కారానికి గడువు ఇంకా ముగియలేదు. మిగిలిన వాటికి గడువు దాటింది. అన్నింటినీ ఎన్నికల షెడ్యూలు వచ్చేలోపు పూర్తిగా పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నాం. ఎన్నికల కమిషన్ తీసుకున్న చర్యలతో ఒక ఆధార్ కార్డు మీద ఐదుకు మించి క్లెయిమ్‌లు అప్‌లోడ్ చేసే అవకాశం లేదు. అయినప్పటికీ ఓటరు జాబితా సవరణలకు సంబంధించి క్లెయిమ్‌లను సకాలంలో పరిష్కరించడంపై ప్రధానంగా దృష్టి సారించాం.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

వేడుకగా కొండచుట్టు



ఉత్సవర్ల వెంట భక్తజనం

● దేవతాగణాలకు ఆదిదంపతుల వీడ్కోలు ● కైలాసగిరుల చుట్టూ భక్తుల కోలాహలం

శ్రీకాళహస్తి, మార్చి 12: శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి ఉత్సవాల్లో మంగళవారం ఋషి రాత్రిని పురస్కరించుకొని శివపార్వతుల కొండచుట్టు వేడుకగా జరిగింది. తమ కల్యాణానికి విచ్చేసిన సకల దేవతాగణాలకు, ఋషులకు ఆదిదంపతులు వీడ్కోలుతో కృతజ్ఞతలు తెలిపారు.ఆలయంలోని అలంకార మండపంలో శ్రీకాళహస్తీశ్వరుడు, జ్ఞానప్రసూనాంబదేవి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి చప్పరాలపై గిరిప్రదక్షిణకు తీసుకెళ్లారు. భేరివారి మండపం వద్ద భేరి కులస్థులు ఇచ్చిన నాగవల్లిని అమ్మవారికి ధరింపజేశారు. అనంతరం జయరామారావు వీధి, ఎన్టీఆర్ నగర్, తెలుగు గంగ, కైలాసగిరి, రాజీవ్ నగర్ కాలనీ, పనసకోనల మీదుగా గిరిప్రదక్షిణ సాగింది. రామాపురం రిజర్వాయరు ఎదురుగా ఉన్న అంజూరు మండపం వద్ద కాసేపు విశ్రాంతి కోసం కొలువుదీర్చి పూజలు చేశారు. భక్తులకు అన్నప్రసాదాలు అందజేశారు. అంజూరు మండపం నుంచి వెయ్యిలింగాలకోన, వేడాం, భైరవ ఎస్టీకాలనీ, తుఫాన్ సెంటర్ మీదుగా శుకబ్రహ్మాశ్రమ సమీపంలోని ఎదురుసేవ మండపానికి స్వామి అమ్మవార్లు సాయంత్రానికి చేరుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు, భక్తులు భక్తిపూర్వకంగా స్వాగతం పలికి పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను రాత్రి ముక్కంటి ఆలయానికి తీసుకువచ్చారు. కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్న అనంతరం శ్రీకాళహస్తీశ్వరుడు అశ్వవాహనంపై, జ్ఞానప్రసూనాంబదేవి సింహవాహనంపై అధిష్ఠించి పురవిహారం చేశారు.ఉభయదారులుగా ఎమ్మెల్యే మధుసూదన రెడ్డి, ఆయన కుటుంబం, ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో నాగేశ్వరరావు, విజయవాడ కనదుర్గమ్మ ఆలయ ఈవో రామారావు, పాలకమండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.



అశ్వ,సింహవాహనాలపై ఆదిదంపతుల విహారం



ఎదురుసేవ మండపంలో హారతి

శ్రీపాద సేవకుల మొరాయింపుతో గిరి ప్రదక్షిణ ఆలస్యం

కైలాసగిరి ప్రదక్షిణ ఊరేగింపులో శ్రీపాద సేవకులు మొరాయించడంతో ఉత్సవం రెండు గంటలు ఆలస్యంగా సాగింది. సోమవారం రాత్రి పట్టణంలో ఒకరు చనిపోవడంతో మంగళవారం ఉదయం చతుర్మాడ వీధుల సంప్రోక్షణ ఆలస్యమైంది. దాంతో కొంత ఆలస్యంగా ఆలయం నుంచి స్వామి, అమ్మవార్లు బయలుదేరారు. శ్రీ పాద సేవకుల్లోని ముగ్గురు పట్టణంలోని తెట్టు వద్ద మద్యం సీసాలు కొనుగోలు చేశారు. వాటిని తీసుకొని కైలాసగిరి ప్రదక్షిణకు ఒకే ద్విచక్ర వాహనంపై బయల్దేరారు.శీతలాంబ ఆలయం పక్కన ఉన్న తొట్టంబేడు పోలీస్ స్టేషన్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ట్రిపుల్ రైడింగ్, 7 మద్యం సీసాలతో పోలీసులకు పట్టుబడ్డారు.ఈ విషయం తెలిసి మా మనుషుల్నే పట్టుకుంటారా అంటూ గిరిప్రదక్షిణలో దేవుని మోస్తున్న శ్రీపాద సేవకులు కాసేపు మొరాయించారు. ఓ ఆలయ అధికారి, వైసీపీ నాయకుడు మాట్లాడి సమస్యను పరిష్కరించారు. ఆ తర్వాత 12 గంటలకు అంజూరు వారి మండపం వద్దకు చేరుకోవాల్సి ఉండగా 2 గంటల ఆలస్యంగా ఉత్సవర్లు అక్కడికి చేరుకున్నారు.మామూలుగా అంజూరు వారి మండపం వద్ద నుంచి శ్రీపాద సేవకులు ముందున్నవారు వెనక్కు... వెనుక వారు ముందుకు మారాల్సి ఉంటుంది. అయితే ముందున్న వారు వెనక్కు వెళ్లబోమనడంతో శ్రీపాద సేవకుల మధ్య మళ్లీ వాగ్వాదం నడిచింది. దాంతో మళ్లీ అక్కడ కాసేపు ఆలస్యం చోటు చేసుకుంది.శుక బ్రహ్మాశ్రమం సమీపంలోని ఎదురు సేవ మండపం వద్దకు 5 గంటలకు రావాల్సిన స్వామి అమ్మవారు సాయంత్రం 7:30 గంటలకు చేరుకున్నారు.

నేడు వసంతోత్సవం

మహాశివరాత్రి ఉత్సవాల్లో బుధవారం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ఉదయం వసంతోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.ఉదయం పురవీధుల ఉత్సవం పూర్తయ్యాక ఉత్సవమూర్తులకు తిరుమంజన గోపురం సమీపంలోని వసంత మండపానికి తీసుకెళ్లి వసంతోత్సవాలను నిర్వహించనున్నారు. సాయంత్రం ఆలయంలో శాస్త్రోక్తంగా ధ్వజావరోహణం నిర్వహించనున్నారు. రాత్రి మేరు పర్వత సింహాసనంపై స్వామి వారు, కామధేనువుపై అమ్మవారు ఆశీనులై పురవీధుల్లో భక్తులకు దర్శనమిస్తారు.



బస్సులోపల వైసీపీ టోపీలు,ప్లాస్టిక్ బాటిళ్లు , హాన్స్ ప్యాకెట్లు, మాంసం

మద్యం గ్లాసులు, ఎముకలతో

ఆర్టీసీ బస్సులు చెక్‌పాయింట్ ఎలా దాటాయ్?

● అలిపిరి టోల్‌గేట్‌లో భద్రతా వైఫల్యాన్ని ఎత్తిచూపిన తాజా ఘటన

తిరుపతి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : పసిబిడ్డల పాల సీసాలు కూడా కొండపైకి అనుమతించరే.. అలాంటిది మద్యం గ్లాసులు, ఎముకలున్న బస్సులు మాత్రం పదుల సంఖ్యలో కొండపైకి ఎలా చేరుకున్నాయి?.... వైసీపీ సిద్ధం సభకు వెళ్ళిన తిరుమల డిపో ఆర్టీసీ బస్సులు వైసీపీ టోపీలతో పాటు మద్యం గ్లాసులు, మాంసం తినగా మిగిలిన ఎముకలతో కొండపైకి చేరుకున్న ఉదంతం మీడియాలో చూసిన పలువురి నోట వినిపిస్తున్న ప్రశ్న ఇది. తిరుమల ఆర్టీసీ డిపో బస్సులైనంత మాత్రాన వాటికి అలిపిరి చెక్ పాయింట్‌లో మినహాయింపులేమీ వుండవు. ఇతర వాహనాలను తనిఖీ చేసిన రీతిలోనే సెక్యూరిటీ సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేశాకే కొండపైకి అనుమతించాల్సి వుంది. ఈ డిపో నుంచీ మొత్తం 40 బస్సులను సిద్ధం సభకు కేటాయించగా అవి తిరిగొచ్చాక ఒకదాన్ని కూడా అలిపిరిలో చెక్ చేయలేదని సమాచారం. పదుల సంఖ్యలో బస్సుల్లో వైసీపీ టోపీలు, మద్యం గ్లాసులు, ఖాళీ బిరియానీ ప్యాకెట్లు, బిరియానీ తినగా మిగిలిన ఎముకలు సీట్ల కింద పడి వున్నాయి. ఈ ఘటన అలిపిరి టోల్‌గేట్‌లో భద్రతా వైఫల్యాన్ని ఎత్తిచూపుతోంది.

తప్పిదం ఆర్టీసీపైకి నెట్టేసే యత్నం

తిరుమల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సుల్లో నిషేధిత, అవాంఛనీయ వస్తువులతో కొండపైకి చేరుకున్న వ్యవహారంలో తప్పిదాన్ని ఆర్టీసీ సిబ్బందిపైకి నెట్టేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీ సభకు జనాన్ని తరలించే డ్యూటీ అయినా లేక కేటాయించిన రూటులో ప్రయాణీకులను తరలించే డ్యూటీ అయినా ఆర్టీసీ బస్సు డ్రైవర్, కండక్టర్లు తమకు నిర్దేశించిన విధులు మాత్రమే నిర్వర్తిస్తారు. అంతేకానీ బస్సుల శుభ్రత వారి డ్యూటీ కాదు. బస్సు గ్యారేజీకి చేరాక అక్కడి సిబ్బంది బస్సులను శుభ్రపరుస్తారు. తిరుమలకు వెళ్ళే బస్సుల్లో నిషేధిత వస్తువులు లేకుండా చూడాల్సిన బాధ్యత డ్రైవరు, కండక్టర్లపై కూడా వుంది. అయితే ఆ విషయంలో ఆ బాధ్యత వారిమీద కన్నా అలిపిరి టోల్‌గేట్ సెక్యూరిటీ సిబ్బందిపై ఎక్కువగా వుంటుంది. ఆర్టీసీ బస్సా లేక ప్రైవేటు వాహనాలా అన్నదానితో నిమిత్తం లేకుండా ప్రతి వాహనం తనిఖీ చేసి పంపాల్సిన బాధ్యత సెక్యూరిటీ సిబ్బందిది. ఆ విధుల్లో వారు ఘోరంగా విఫలమైనట్టు సోమవారం నాటి ఘటన తేటతెల్లం చేస్తోంది. టీటీడీ సెక్యూరిటీ విభాగం వైఫల్యాన్ని కప్పిపెట్టి ఆర్టీసీపరంగా విచారణకు ఆదేశించడం, ఆర్టీసీ డ్రైవర్లపై చర్యలకు ఉపక్రమించడం విమర్శలకు దారి తీస్తోంది. వైసీపీ టోపీ, మద్యం గ్లాసులు, బిరియానీ ప్యాకెట్లు, ఎముకలు వంటి నిషేధిత వస్తువులే కానీ తిరుమల భద్రతకు ప్రమాదకరమేమీ కాదు. వాటి వల్ల కొండ పవిత్రత దెబ్బతింటుందే కానీ ఎవరికీ ప్రమాదకరం కాదు. ఇదే ఆర్టీసీ బస్సుల్లో పై వస్తువులు కాకుండా ఉగ్రవాదులు పేలుడు పదార్థాలు వంటివి తరలించే వుంటే పరిస్థితి ఏమిటన్నది పలువురి ప్రశ్న. ఈ కోణంలో ఆలోచిస్తే అలిపిరి చెక్ పాయింట్ డొల్లతనం ఏమిటో జనానికి సులువుగా అర్థమవుతుంది.

చెక్ పాయింట్‌లో కొన్ని వర్గాలకు మినహాయింపు

టీటీడీ ఉద్యోగులు, తిరుమల స్థానికులు చెక్ పాయింట్‌లో కిందకు దిగకుండా బస్సుల్లోనే కూర్చుని వుంటారన్న ఆరోపణలున్నాయి. వారిలో కొందరు కొండపైకి అక్రమంగా మద్యం, మాంసం వంటివి తీసుకెళ్ళడం సర్వసాధారణమని సమాచారం. బస్సులోకి సెక్యూరిటీ సిబ్బంది ఎక్కి వీరిని ప్రశ్నిస్తే టీటీడీ ఉద్యోగులు తాము స్టాఫ్ అని ఐడీ కార్డులు చూపడం, తిరుమల స్థానికులు తాము లోకల్ అని చెప్పడం తోనే సిబ్బంది మారుమాటాడకుండా బస్సు దిగేస్తుంటారన్న విమర్శలున్నాయి. కొండపైకి మద్యం తీసుకెళ్ళే వారు అక్కడ రెట్టింపు ధరకు విక్రయిస్తున్నారని సమాచారం. అదే విధంగా కొండపై వ్యాపారులు, స్థానికుల్లో పలువురు సాయంత్రం తిరుపతికి వచ్చి మద్యం సేవించి రాత్రికి తిరిగి కొండకు వెళ్ళడానికి అలవాటు పడ్డారు. కొందరు రోజూ ఇలాచేస్తుండగా, మరికొందరు వారానికి ఒకటి రెండు సార్లు వచ్చి వెళుతుంటారు. ఇలాంటి వారు మద్యం సేవించి బస్సులు, జీపుల్లో వెళుతున్నా అలిపిరి చెక్‌పాయింట్ సిబ్బంది పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. రోజూ రాత్రి 7-10 గంటల నడుమ ఇలాంటి వారు పెద్దసంఖ్యలో తిరుమల వెళుతుంటారు. ఖరీదైన కార్లు, పలుకుబడి కలిగిన వారి వాహనాలను సెక్యూరిటీ సిబ్బంది కన్నెత్తి కూడా చూడరని, వచ్చిన వాహనాన్ని వచ్చినట్టే చెక్‌పాయింట్ దాటిస్తారన్న పేరుంది. సామాన్యుల విషయంలో పాల బాటిళ్ళు, నీళ్ళ బాటిళ్ళు కూడా అనుమతించని సిబ్బంది పలుకుబడి కలిగిన వారు హెయిర్ డ్రైయర్లు, ఐరన్ బాక్సులు వంటివి తీసుకెళుతున్నా పట్టించుకోరన్న విమర్శలున్నాయి. తాజా ఘటనతోనైనా టీటీడీ యంత్రాంగం మేలుకొని అలిపిరి టోల్‌గేట్‌లో భద్రతా వైఫల్యాన్ని సమీక్షించుకోవాల్సిన అవసరముంది. దీనికి బాధ్యులైన సిబ్బందిపై చర్యలు తీసుకోవడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా భద్రతా ప్రమాణాలు కట్టుదిట్టంగా అమలు చేయాల్సిన అవసరముంది.

చెక్ పాయింట్‌లో సామాన్య భక్తులకు చుక్కలు

అధికార ఆర్భాటం, పలుకుబడి కలిగిన వారి సంగతి పక్కన పెడితే సామాన్యులు అలిపిరి చెక్ పాయింట్ దాటాలంటే దేవుడి కంటే ముందు చుక్కలు చూస్తారన్న సామెత వుంది. కొండపైన టీటీడీ ప్లాస్టిక్ వినియోగంపై నిషేధం విధించడంతో అలిపిరి చెక్ పాయింట్‌లో ప్లాస్టిక్ బాటిళ్ళను అనుమతించడం లేదు. బస్సుల్లో, జీపుల్లో వెళ్ళే వారు తమకు చిన్న పిల్లలున్నారని, మధ్యలో దాహమైనా, ఆకలైనా ఇబ్బంది పడతామని కాళ్ళావేళ్ళా పడినా చెక్ పాయింట్ సెక్యూరిటీ సిబ్బంది ససేమిరా అంటారని నీళ్ళ బాటిళ్ళు, పాల సీసాలను లాక్కుంటారని పెద్ద పేరుంది. కొంతమంది సామాన్య యాత్రికులు కొండపైన కాటేజీల్లో వేడి నీటితో స్నానం చేసేందుకు గీజర్లు వెంట తీసుకుపోవడం పరిపాటి. అలాంటివి కూడా సెక్యూరిటీ సిబ్బంది కఠినంగా అడ్డుకుంటుంటారు. జీపులు, కార్లు, బస్సుల్లో వచ్చే యాత్రికులు చెక్ పాయింట్‌లో ఖచ్చితంగా కిందకు దిగాల్సిందే. లగేజీ మొత్తం కిందకు దింపాల్సిందే. తమతో పాటు, లగేజీని కూడా సెక్యూరిటీ స్కాన్ చేయించుకున్నాకే చెక్ పాయింట్ దాటి తిరిగి వాహనాలు ఎక్కాల్సి వుంటుంది. యాత్రికులు దిగి లగేజీ కిందకు దింపేశాక ఖాళీ జీపులు, కార్లు, బస్సులను సెక్యూరిటీ సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేయాల్సి వుంటుంది. డ్రైవర్, కండక్టర్లను కూడా చెక్ చేయాల్సి వుంటుంది. జీపులు, కార్లు, కిందకు దిగిన సామాన్య యాత్రికులను తనిఖీ చేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది బస్సుల విషయంలో నిర్లక్ష్యంగా వుంటున్నారనే ఆరోపణలున్నాయి. తిరుమల వచ్చే అద్దె వాహనాల డ్రైవర్లకు కొండపై నిబంధనలు తెలియవు.వాహనాల్లో ఇతర మతాలకు చెందిన చిన్నపాటి చిహ్నాలు, వస్తువులున్నా తెలియక టోల్ గేట్‌లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఆయా వస్తువులను, చిహ్నాలను తొలగించి కొండపైకి అనుమతించాల్సిన సిబ్బంది దానికి బదులు డ్రైవర్‌ను గంటల కొద్దీ నిర్బంధించడం,ప్రశ్నించడం చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

రంజాన్ ఉపవాస వేళలు

ఇఫ్తార్ : బుధవారం సాయంత్రం 6-31 గంటలకు

సహరి : గురువారం ఉదయం 5-03 గంటలకు

దళితులకు టీడీపీలోనే ఉన్నత పదవులు



కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

రామచంద్రాపురం, మార్చి 12: దళితులు రాజకీయంగానే కాకుండా అన్ని రంగాల్లో టీడీపీతో ఎన్నో ఉన్నత పదవులు పొందారని ఆ పార్టీ ఎస్సీసెల్ నాయకులు అన్నారు. మంగళవారం కమ్మపల్లి పంచాయతీలోని దేశూరికండ్రిగ, హరిజనవాడ, కమ్మపల్లి దళితవాడలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ముందుగా గ్రామదేవతలకు పూలు చేశారు. అనంతరం టీడీపీ ప్రజలకు అందించనున్న సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎస్సీసెల్ మండలాధ్యక్షుడు రవికుమార్, రాజా, శేషాద్రి, ప్రసాద్, మహేష్, రాజశేఖర్, వెంకట్రామయ్య, రామూర్తి, మహేష్, జ్ఞానశేఖర్, చిట్టెమ్మ, గిరిజమ్మ, విజయనిర్మల, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎప్పటికీ టీడీపీలోనే కొనసాగుతాం



టీడీపీ జెండా ఊపుతున్న కార్యకర్తలు

రామచంద్రాపురం, మార్చి 12: ఎప్పటికీ తెలుగుదేశం పార్టీలోనే కొనసాగుతామని రావిళ్లవారిపల్లె హరిజనవాడ ప్రజలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో సోమవారం సిమెంటురోడ్డు ప్రారంభానికి వెళితే వైసీపీ నాయకులు ఆ పార్టీ కండువా కప్పారన్నారు. అయితే తాము ఆ పార్టీలో చేరలేదన్నారు. తెలుగు యువత మండల అధ్యక్షుడు గిరినాయుడు వారి వెంట వున్నారు.

శంకర్‌యాదవ్‌కు అభినందన

తిరుచానూరు, మార్చి 12: యాదవ మహాసభకు రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శిగా నియమితులైన తిరుపతికి చెందిన శంకర్‌యాదవ్‌ను పులివర్తి నాని అభినందించారు మంగళవారం ఉదయం నానీని శంకర్‌యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు.

అభివృద్ధి పనుల ప్రారంభం

తిరుపతి రూరల్,మార్చి12: మండలంలో పలు పంచాయతీల్లో తుడా నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. గాంధీపురంలో రూ.5.50కోట్లు, సి.మల్లవరంలో రూ.5.01కోట్లు, పెరుమాళ్లపల్లెలో రూ.14కోట్లు, పుదిపట్లలో రూ.2 కోట్లు, వేంకటపతినగర్‌లో రూ.2.96కోట్లు, పేరూరులో రూ.8.85కోట్లు, తుమ్మలగుంటలో రూ.9.66కోట్లు, చెర్లోపల్లెలో రూ.4కోట్లు రామానుజపల్లెలో రూ.2.26కోట్లు, మల్లంగుంటలో రూ.3కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఎంపీపీ యశోద, వైస్‌ఎంపీపీ విడుదల మాధవరెడ్డి, జెడ్పీటీసీ రత్నమ్మ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డుసభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

రామచంద్రాపురం మండలంలో..

రామచంద్రాపురం: మండలంలోని నెన్నూరు, నడవలూరు, గంగిరెడ్డిపల్లి, సి.రామాపురం సచివాలయాల పరిధిలో జరిగిన అభివృద్ధి పనులను మంగళవారం ఎంపీపీ బ్రహ్మానందరెడ్డి, జడ్పీటీసీ ఢిల్లీరాణి బానుకుమార్‌రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి, చెవిరెడ్డి ధ్యానేష్ రెడ్డి ప్రారంభించారు. ఎంపీడీవో ప్రత్యూష, ఏపీఎం రాధమ్మ, ఎంపీటీసీ మునీంద్రయాదవ్, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ గిరిధర్‌రెడ్డి, సర్పంచులు అనసూయమ్మ, గణపతిరెడ్డి, కమ్మకండ్రిగ వైస్ సర్పంచ్ వేణు,మాజీ సర్పంచ్ జ్యోతి, డివిజన్ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, రావిళ్లవారిపల్లె పంచాయతీ కన్వీనర్ వెంకటేష్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ఆవిర్భావ దినోత్సవం

రామచంద్రాపురం, మార్చి 12: మండలంలోని నెన్నూరులో వైసీపీ ఆవిర్భావ దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ వైసీపీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. జడ్పీటీసీ ఢిల్లీరాణిభానుకుమార్‌రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి, మార్కెట్‌కమిటీ వైస్ ఛైర్మన్ గిరిధర్‌రెడ్డి, నాయకులు ఈశ్వర్‌రెడ్డి, చంద్రారెడ్డి, డివిజన్ అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఇంటింటి ప్రచారం



తిరుచానూరులో ప్రచారం చేస్తున్న నాని

తిరుచానూరు, మార్చి 12: తిరుచానూరు పంచాయతీలో సమస్యలు తిష్ట వేశాయని స్థానికులు చంద్రగిరి టీడీపీ ఇన్‌ఛార్జి పులివర్తి నాని దృష్టికి తీసుకువచ్చారు. మంగళవారం మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని, బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాల్లో భాగంగా పులివర్తి నాని చంద్రశేఖర్ కాలనీ, ఎస్వీపీ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా జనసేన, టీడీపీ నాయకులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. పులివర్తి నాని ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పంచాయతీలో ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు. ఈశ్వర్‌రెడ్డి, అమిలినేని మధు, మధుశేఖర్, కిషోర్‌రెడ్డి, సాల్మన్‌రాజ్, దిలీప్‌రాయల్, జయకృష్ణ, సాయిరాయల్, వాసు, మునిరత్నంరెడ్డి, కళావతి, మహేశ్వరి, వాణిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీపురం మఠం భూముల్లో రగడ

- ఇరువర్గాల భౌతిక దాడులు



తిరుపతి రూరల్, మార్చి12: మండలంలోని గాంధీపురం పంచాయతీ పరిధి తిరుమలనగర్‌లోని హథీరాంజీ మఠం భూముల్లో ఆక్రమణదారుల మధ్య మంగళవారం ఉదయం రగడ జరిగింది. ఇరువర్గాలకు చెందిన పలువురు పరస్పరం భౌతికదాడులకు పాల్పడ్డారు. వివరాలోకి వెళ్లితే.. ఒకవర్గానికి చెందిన వ్యక్తులు తమస్థలంలో ఉప్పరపల్లెకి చెందిన వారు దౌర్జన్యంగా రేకులషెడ్డు నిర్మించారంటూ షెడ్డు గోడ, కిటికీలను పగలగొట్టారు. దీన్ని అక్కడే ఉన్న ఉప్పరపల్లెకు చెందిన వారు ప్రతిఘటించి అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాలకు చెందిన వారు భౌతికదాడులకు దిగారు. కాగా తిరుపతికి చెందిన వరదరాజులు మాట్లాడుతూ తాను 2018లో ఈస్థలాన్ని కొనుగోళ్లు చేసి రేకులషెడ్డు నిర్మించానని, విద్యుత్ మీటరు కూడా తీసుకున్నానని, ఉప్పరపల్లెకి చెందిన కొందరు దానిపై దౌర్జన్యంగా రేకులషెడ్డు నిర్మించి తమదని అంటున్నారని వాపోయారు. వైసీపీ రూరల్ మండల మహిళా విభాగం మాజీ అధ్యక్షురాలు ఆదిలక్ష్మి వెనుకుండి నడిపిస్తున్నారని ఆయన ఆరోపించారు. కాగా ఈయనకు ఆటోనగర్, చైతన్యపురానికి చెందిన పలువురు మహిళలు, పురుషులు వచ్చి అండగా నిలబడి రేకులషెడ్డులో కొంతభాగాన్ని తొలగించారు. అవతలివ్యక్తులు అడ్డుకుని గొడవపడడంతో కొంతసేపు ప్రతిఘటించి వెనక్కి వెళ్లిపోయారు.

వేగంగా వెళ్లి.. చెట్టును ఢీకొని..!

- పోలీసులను తప్పించుకునే క్రమంలో 'ఎర్ర' కారుకు ప్రమాదం
- ముగ్గురు పట్టుబడగా.. మరో ముగ్గురు పరారీ

కల్లూరు, మార్చి 12: పోలీసులకు చిక్కకుండా వెళ్లే క్రమంలో అదుపు తప్పి ఎర్రచందనం కారు చెట్టును ఢీకొంది. ఈ ఘటనతో ముగ్గురు ఎర్ర కూలీలు పట్టుబడగా మరో ముగ్గురు పరారయ్యారు. కల్లూరు ఎస్‌ఐ రవిప్రకాష్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. పులిచెర్ల మండలం చెరువుముందరపల్లి సమీపంలో మంగళవారం మధ్యాహ్నం సిబ్బందితో కలిసి ఎస్‌ఐ వాహనాల తనిఖీ చేపట్టారు. మంగళంపేట వైపు నుంచి పులిచెర్ల వైపు వస్తున్న కారులోని వారు ఈ తనిఖీలను గమనించారు. పోలీసుల నుంచి తప్పించుకునే క్రమంలో వేగంగా వెళుతూ చెట్టును ఢీకొన్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకునేలోపు డ్రైవర్ సహా ముగ్గురు పారిపోయారు. మిగిలిన ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. వీరు తమిళనాడు రాష్ట్రం ధర్మపురి జిల్లాకు చెందిన రామన్ కొలంధై (47), సేలం జిల్లాకు చెందిన పెరుమాళ్ (41), మురుగన్ (36)గా తెలిసింది. ఈ ప్రమాదంలో మురుగన్‌కు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. మిగిలిన ఇద్దరిని రిమాండుకు తరలిస్తున్నారు. వీరి నుంచి రెండు దుంగలు, ఐదు గొడ్డళ్లు, రంపం, వేయింగ్ మిషన్, కత్తులను స్వాధీనం చేసుకున్నారు.

గంగమ్మను దర్శించుకున్న నాని

రామచంద్రాపురం, మార్చి12: వేపకుప్పం గ్రామంలో జరుగుతున్న బాట గంగమ్మ తిరునాళ్లకు టీడీపీ చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని మంగళవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు స్వాగతం పలికి అమ్మవారి దర్శనానంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి, జిల్లా నాయకులు చిన్నబాబు, జనార్దన్‌చౌదరి, ఉమాపతినాయుడు, నరసింహారెడ్డి, జేడీ జగన్, హరిప్రసాద్, మండల నాయకులు గిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

- ఎంపీ గురుమూర్తి



తిరుచానూరు, మార్చి 12: యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా సీడాప్-డీఆర్‌డీఏ ద్వారా అమలు చేస్తున్న దీన్‌దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన(డీడీయూ-జీకేవై) పూర్వ విద్యార్థుల సమ్మేళనం మంగళవారం తిరుచానూరులోని పద్మావతి కన్వెన్షన్ సెంటర్‌లో జరిగింది. చిత్తూరు, కడప, నెల్లూరు, అనంతపురం, కర్నూలు, ప్రకాశం జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత యువత 2022-23, 2023-24 సంవత్సరానికి గాను డీడీయూ - జీకేవై శిక్షణ పొంది వివిధరంగాల్లో ఉపాధి పొందిన పూర్వ విద్యార్థులు దాదాపు600మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ డాక్టర్ మద్దెల గురుమూర్తి మాట్లాడుతూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి జగన్ ప్రభుత్వం అన్నిసహాయ సహకారాలు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ శిరీష, సిడాప్ ఛైర్మన్ శ్యాంప్రసాద్‌రెడ్డి, సీడాప్ సీఈవో శ్రీనివాసులు, డీఆర్‌డీఏ పీడీ జ్యోతి, జేడీఎం సరితారెడ్డి, సీడాప్ స్టేట్‌మిషన్ మేనేజర్లు, సిబ్బంది, ట్రైనింగ్ పార్టనర్స్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధినిచ్చే శిక్షణ సద్వినియోగం చేసుకోండి

- పరిశ్రమలశాఖ జీఎం ప్రతాప్‌రెడ్డి



మాట్లాడుతున్న ప్రతాప్‌రెడ్డి, పక్కనే జ్ఞానశేఖర్‌రెడ్డి

తిరుపతి(రూరల్),మార్చి12: స్వయం ఉపాధినిచ్చే శిక్షణా కార్యక్రమాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని పరిశ్రమలశాఖ జిల్లా జనరల్ మేనేజర్ ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. పీఎం విశ్వకర్మ యోజన పథకం ద్వారా టైలరింగ్‌లో శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలకు మంగళవారం తిరుపతి రూరల్ మండలం గాంధీపురంలోని ఎన్‌ఆర్ఐ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. రూరల్ మండలపరిధిలో శ్రీటెక్నాలజీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈశిక్షణలో 600మంది మహిళలకు సర్టిఫికెట్లను అందించారు. మాస్‌సంస్థ అధినేత జ్ఞానశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ శిక్షణ పొందిన మహిళలకు కుట్టుమిషన్‌తోపాటు శిక్షణా సమయంలో రూ.500 అందిస్తున్నామని చెప్పారు. రూ.50వేలనుంచి రూ.3లక్షలవరకు రుణసదుపాయాన్ని కూడా కల్పిస్తున్నామని తెలిపారు. అలాగే రూ.15వేల విలువైన టూల్‌కిట్ అందజేస్తున్నామని వివరించారు. ఎంపీపీ యశోద, వైస్‌ఎంపీపీ మాధవరెడ్డి, ఎంపీటీసీ జయకుమార్, సర్పంచ్‌లు వెంకటరమణ, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి



తిరుపతి రూరల్,మార్చి12: రూరల్ మండలంలో గాంధీపురం పంచాయతీ పరిధిలోని 70కుటుంబాలకు చెందిన వైసీపీ సానుభూతిపరులు మంగళవారం టీడీపీలో చేరారు. పంచాయతీ వార్డు సభ్యురాలు చల్లా ప్రేమ నేతృత్వంలో చల్లా శివశంకర్, చల్లా శ్రీనివాసులుతో పాటు పలువురు చంద్రగిరి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పులివర్తి నాని సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మార్‌పల్లె పోలీస్‌స్టేషన్ కూడలి నుంచి గాంధీపురం పంచాయతీలో శ్రీనగర్ కాలనీవరకు టీడీపీ నాయకులు బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన సభలో నాని మాట్లాడుతూ 2014-19వరకు టీడీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి తప్ప తర్వాత ఎక్కడా జరగలేదని విమర్శించారు. టీడీపీ హయాంలో ఉమ్మడి అవిలాల పంచాయతీలో అభివృద్ధి జరిగిందని గుర్తు చేశారు. టీడీపీ అధికారం ఇస్తే మఠం భూములకు ఎన్‌వోసీ అందించే బాధ్యతతో పాటు తుమ్మలగుంట, అవిలాల చెరువులను సంరక్షించే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. తుమ్మలగుంటలో పేదల ఇళ్లను కూలగొట్టించిన ఎమ్మెల్యే, మఠం అధికారులకు ఎంకేనాయుడు కాలనీలో మఠం భూముల్లో నిర్మించిన విల్లాలు కనబడలేదా అని ప్రశ్నించారు.

ఆ ఇద్దరు సీఐలపై చర్యలు తీసుకోండి

- రూరల్ సీఐకి పులివర్తి నాని ఫిర్యాదు



రూరల్ పోలీస్‌స్టేషన్ వద్ద పులివర్తి నాని

తిరుపతి క్రైం, మార్చి 12: తన భార్య సుధారెడ్డిపై విచక్షణా రహితంగా దాడి చేసిన ఈస్ట్ సీఐ, రేణిగుంట సీఐలపై చర్యలు తీసుకోవాలని చంద్రగిరి టీడీపీ ఇన్‌ఛార్జి పులివర్తి నాని డిమాండ్ చేశారు. మంగళవారం రాత్రి తిరుపతి రూరల్ పోలీస్‌స్టేషన్‌కెళ్లి సీఐ అహ్మద్‌కు ఈ మేరకు ఫిర్యాదు చేశారు. అనంతరం స్టేషన్ వెలుపల ఆయన మీడియాతో మాట్లాడుతూ 'వారం కిందట తుమ్మలగుంటలోని మఠం భూముల్లో అక్రమ నిర్మాణాలు తొలగిస్తున్నారన్న సమాచారంతో తన భార్య సుధారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకున్నారన్నారు. ఆ సమయంలో సీఐ లిద్దరూ దాడి చేయడంతో ఆమె కాలికి తీవ్ర గాయమైంది. దానిపై ఆధారాలతో మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశానని వివరించారు. పోలీసులంటే తమకు గౌరవం ఉందని.. ఎమ్మెల్యే మాటలు విని ఇలాంటి ఘటనలకు పాల్పడటం మంచి పద్ధతి కాదన్నారు.

దళితుడనే వర్కులు ఇవ్వడంలేదు

- ఎ.రంగంపేట సర్పంచ్ ఆవేదన



ఎ.రంగంపేట పంచాయతీ సమావేశం

చంద్రగిరి, మార్చి 12: దళితుడనే తనకు వర్కులు ఇవ్వడం లేదని ఎ.రంగంపేట సర్పంచ్ ఎర్రయ్య ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం సర్పంచ్ అధ్యక్షతన పంచాయతీ సమావేశం ఏర్పాటు చేశారు. ఎ.రంగంపేటలోని అండర్ డ్రైనేజీ నిర్మాణం కోసం యాదవవీధికి రూ.10 లక్షలు, భజనగుడి వీధికి రూ.15 లక్షల తుడా నిధులు మంజూరయ్యాయి. అయితే ఆ పనులు తనకే కావాలని ఉపసర్పంచ్ మోనీష్‌రెడ్డి పట్టుబట్టారు. దీంతో సర్పంచ్ సమావేశం నుంచి మధ్యలోనే లేచి వెలుపలికి వచ్చేశారు. మెజారిటీ వార్డు సభ్యులు తుడా వర్కులను ఉప సర్పంచ్ మోనీష్‌రెడ్డికి ఇవ్వాలని తీర్మానం చేశారు. దీనిపై సంబంధిత కార్యదర్శి శిరీషను వివరణ కోరగా మెజారిటీ వార్డు సభ్యుల కోరిక మేరకే తీర్మానం చేసి ఉన్నతాధికారులకు పంపించినట్లు తెలిపారు.వారి ఆదేశాల ప్రకారం తుడా వర్కులు ఎవరికి ఇవ్వాలంటే వారికి ఇస్తామని తెలిపారు. అయితే సర్పంచ్ ఎర్రయ్య మాట్లాడుతూ తను సర్పంచ్‌గా ఎన్నికైనప్పటి నుంచి పంచాయతీలో కొందరు ప్రజాప్రతినిధులు చిన్నచూపు చూస్తున్నారని వాపోయారు. యాదవవీధిలో తుడా నిధుల ద్వారా వచ్చిన వర్కులకు సంబంధించి పనులు ప్రారంభిస్తే కొంతమంది వార్డు సభ్యులు అడ్డుకున్నారని పేర్కొన్నారు. ఆ సమయంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి దూరంగా ఉండాలని నిర్ణయించుకొన్నానని, అయితే ఎంపీపీ, వైసీపీ నాయకులు తుడా వర్కులు తనకే ఇస్తామని అప్పట్లో హామీ ఇచ్చారని గుర్తుచేశారు. దాని ప్రకారమే ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేశామని తెలిపారు. ప్రస్తుతం పనులు తనకు కాకుండా ఉపసర్పంచ్‌కు ఇచ్చారన్నారు. తనకు జరుగుతున్న అవమానాలను దళిత సంఘాల దృష్టికి తీసుకెళతానని పేర్కొన్నారు.

వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం

భాకరాపేట, మార్చి 12: వైసీపీ పాలనలో రాష్ట్ర అభివృద్ధి శూన్యమని టీడీపీ యువ నేత పులివర్తి వినీల్ అన్నారు. 'మీ ఇంటికి మీ పులివర్తి నాని, బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన చిన్నగొట్టిగల్లు మండలం రంగన్నగారిగడ్డ పంచాయతీలో పర్యటించారు. సూపర్ సిక్స్ కరపత్రాలు పంపిణీ చేశారు.టీడీపీ మండల అధ్యక్షుడు బెల్లంకొండ మురళి, ప్రధాన కార్యదర్శి మదనమోహన, తెలుగు మహిళ అధ్యక్షురాలు చిట్టెమ్మ, నాయకులు ఆర్వీ రమణారెడ్డి, వెంకటసుబ్బయ్య, మోహన్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, మునస్వామి నాయుడు, కుమారస్వామిరెడ్డి, మల్లికార్జునరెడ్డి, జేడీ బాలాజీ, భాను, విజయకుమార్, గురుమూర్తి, ఎర్రయ్యనాయుడు, తులసీరాయల్, నాగిరెడ్డి, రమేశ్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, మౌలాలి, చలపతి, మురళి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం



నాగాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

చంద్రగిరి, మార్చి 12: చంద్రగిరి జాతీయ రహదారిలో వెలసిన నాగాలమ్మ ఆలయ ఆవరణలో గణపతి, సుబ్రమణ్యా స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి.వేదపండితులు శివరామ్‌శర్మ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, ప్రధాన మండప, దేవాదేవతా ఆరాధనలు, అవరణ, మూలమంత్ర, హోమాలు, సమస్త చూర్ణికలు, తీర్థప్రసాద వినియోగాలు జరిగాయి. సాయంత్రం కలశ మండపారాధన, యాగాశాలార్చన, శాలాంగదేవతా హోమం, మూర్తిహోమం, కళాహోమం, శాంతి హోమం, నీరాజన మంత్రపుష్ప, చతుర్వేద స్వస్తి ఆశీర్వాచనం, తీర్థప్రసాద వినియోగాలు జరిగాయి. ఆలయ ధర్మకర్త శివశంకర్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

రామకృష్ణ పరమహంస జయంతి



ప్రసంగిస్తున్న డాక్టర్ పీపీ రెడ్డి

పాకాల, మార్చి 12: రామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో మంగళవారం భగవాన్ రామకృష్ణ పరమహంస 189వ జయంతిని పాకాలలో ఘనంగా నిర్వహించారు.స్థానిక రామకృష్ణ మందిరంలో ఉదయం అష్టోత్తర నామార్చన, విష్ణుసహస్ర నామార్చన, విశేషపూజ, పుష్పాంజలి, భాస్కరస్వామిచే నిర్వహించారు. తిరుపతి రామకృష్ణ మిషన్ ఆశ్రమ అధ్యక్షుడు డాక్టర్ వీవీ రెడ్డి రామకృష్ణ పరమహంస బోధనలపై ప్రసంగించారు. మధ్యాహ్నం భక్తులకు భోజన ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ సేవాసమితి అధ్యక్షుడు డాక్టర్ ఎస్‌సి.రామచంద్రారెడ్డి, కార్యదర్శి పి.రవినాయుడు, విశ్రాంత ప్రొఫెసర్ రామకృష్ణ, గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్, రామకృష్ణ సేవాసమితి సభ్యులు ఎస్.పరంధామనాయుడు, వి.సుధాకర్ రెడ్డి, సి.గురవయ్యనాయుడు, ఎ.ఆనందనాయుడు, ఓంకార్ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో నాణ్యమైన దిగుబడి

పాకాల, మార్చి 12: మామిడి తోటల్లో సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టి నాణ్యమైన అధిక దిగుబడి సాధించాలని ఉద్యాన అధికారిణి ఎస్‌.శైలజ కోరారు. దామలచెరువు పంచాయతీ మొరవపల్లె, కాకర్లవారిపల్లె పరిసరాలలో మంగళవారం మామిడి, మిరపతోటలను ఆమె పరిశీలించారు. అధిక ఉష్ణోగ్రత, తేనె మంచు పురుగు, బూడిద తెగులు, అధిక తేమ, హార్మోన్ల లోపం, ఫలదీకరణ చెందని పూత తోటలలో తగిన సస్యరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. పిందెలు బఠాణీ గింజ పరిమాణంలో వున్నప్పుడు పది రోజుల వ్యవధితో మూడు నుంచి నాలుగు తడుల నీరు ఇవ్వాలన్నారు. ఇసుక నేలలు, బంక నేలలు ఉన్న తోటలలో 5 నుంచి 6 తడులు ఇవ్వాలన్నారు. పది సంవత్సరాల పైబడిన మామిడి చెట్లకు నీళ్లు పారిస్తున్న రైతులు ఒక్కోచెట్టుకు 3 కేజీల సింగిల్ సూపర్ పాస్పేట్, అర కేజీ యూరియా, అర కేజీ పొటాష్ ఎరువులు వేసి నీళ్లు పారిస్తే కాయ నాణ్యత పెరుగుతుందన్నారు. నీళ్లు పారించని తోటలలో మల్టీకె 10 గ్రాములు, కార్బన్‌డైజం 1 గ్రాము, 0.5మిల్లీలీటర్ల జిగురు ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. దీంతో పిందెలు రాలకుండా ఉంటాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన సహాయకురాలు దేవకి, రైతులు పాల్గొన్నారు.

మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను పాటించాలి: కమిషనర్



అదితిసింగ్

తిరుపతి అర్బన్, మార్చి 12: మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను తప్పకుండా పాటించాలని తిరుపతి నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, నగర కమిషనర్ అదితిసింగ్ సూచించారు. ఎన్నికల విధుల నిర్వహణపై మంగళవారం సెక్టోరల్ ఆఫీసర్స్, సూపర్‌వైజర్స్, బీఎల్‌వోలకు కచ్చపి ఆడిటోరియంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రానున్న సార్వత్రిక ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపడుతున్నామన్నారు. ఓటర్ స్లిప్‌లను జాగ్రత్తగా పంపిణీ చేయాలని చెప్పారు. తిరుపతి అదనపు ఓటర్ నమోదు అధికారి, అర్బన్ తహసీల్దారు వి.ఎస్.నారాయణరెడ్డి, అదనపు కమిషనర్ చరణ్‌తేజ్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, డీటీ అశోక్‌రెడ్డి, ఏఈఆర్వోలు పాల్గొన్నారు.

పదవీ విరమణ సన్మానం



తులసికి చెక్ అందజేస్తున్న ఎస్పీ కృష్ణకాంత్ పటేల్

తిరుపతి క్రైం, మార్చి 12: తిరుపతి జిల్లా పోలీసు ఆస్పత్రిలో పని చేస్తూ ఇటీవల పదవీ విరమణ పొందిన మహిళా హోంగార్డు సి.తులసిని ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ మంగళవారం సన్మానించారు. ఆమె సేవలకు కానుకగా జిల్లాలోని హోంగార్డులంతా తమ ఒక్కరోజు వేతనం రూ.5లక్షలను ఆమెకు ఇచ్చారు. ఈ మొత్తానికి సంబంధించిన చెక్‌ను జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ అందజేశారు.

భారతీయ ఆత్మ రామకృష్ణ పరమహంస

తిరుపతి (కల్చరల్), మార్చి 12: అన్నిమతాల సారం ఒకటేనని, సనాతన ధర్మాన్ని ప్రకటించిన భారతీయ ఆత్మ రామకృష్ణ పరమహంస అని టీటీడీ వేదపాఠశాల ఆచార్యుడు ఇంద్రగంటి సత్యకిషోర్ శాస్త్రి అన్నారు. రామకృష్ణ పరమహంస జయంతి వేడుకలు మంగళవారం వినాయక నగర్‌లోని రామకృష్ణమిషన్ ఆశ్రమంలో నిర్వహించారు. త్యాగపురుషుడు రామకృష్ణ అనే అంశంపై ఆశ్రమ కార్యదర్శి స్వామి సుకృతానంద ప్రసంగించారు. కాగా, ఉదయం తొమ్మిది గంటలకు ఎస్వీ వైద్య కళాశాల కూడలిలోని స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేశారు. సాయంత్రం 6.30 నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు భజనలు జరిగాయి. స్వామిసత్వస్తానంద, చైతన్య, జయచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భాష్యం స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డే



తిరుపతి(విద్య), మార్చి 12: వరదరాజనగర్ శ్రీపురంకాలనీలోని భాష్యం స్కూల్‌లో మంగళవారం కల్చరల్ ఫెస్ట్, గ్రాడ్యుయేషన్‌డే నిర్వహించారు. ముఖ్య అతిథులుగా బర్డ్ డైరెక్టర్ ఆర్.రెడ్డెప్పరెడ్డి, స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్ హాజరయ్యారు. ప్రతిభచాటిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. జోనల్ ఇన్‌చార్జి లక్ష్మణ్, ప్రిన్సిపాల్ బాలాజి, లిటిల్ చాంప్స్ ఇన్‌చార్జి సుధాకుమారి, టీచర్లు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి

తిరుపతి సెంట్రల్, మార్చి 12: ప్రజా సమస్యలను పరిష్కరించాలని సోషలిస్టు యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర నాయకుడు గోవిందరాజులు డిమాండ్ చేశారు. మంగళవారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఎంఆర్‌పల్లె నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు ప్రదర్శన చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. అలాగే రాష్ట్రంలో ప్రతి ఏడాది జాబ్‌మేళాతో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని సీఎం ఇచ్చిన హామీ అమలు చేయక పోవడంతో నిరుద్యోగ సమస్య పెరిగిందని మండిపడ్డారు. ఇకనైనా ప్రజలు ఉద్యమాలతో ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. నాయకులు కె.కుమార్‌రెడ్డి, ఎ.హరీష్, ఎల్ఎన్ లక్ష్మి, వెంకటసుబ్బయ్య, ప్రజలు పాల్గొన్నారు.

శ్రీవాణి ట్రస్టు నిధులతో పెద్దగంగమ్మ ఆలయ పునర్నిర్మాణం

తిరుపతి అర్బన్, మార్చి 12: శ్రీవాణి ట్రస్టు నిధులతో పెద్దగంగమ్మ ఆలయ పునర్నిర్మాణం చేపడుతున్నట్లు టీటీడీ ఛైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి తెలిపారు. మంగళవారం ఉదయం ఆర్టీసీ బస్టాండుకు సమీపంలో ఉన్న తాళ్లపాక పెద్ద గంగమ్మ ఆలయ జీర్ణోద్ధరణ, పునఃప్రతిష్ఠ పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. నిర్మాణపనులు శరవేగంగా జరుగుతున్నాయని, త్వరలోనే కుంభాభిషేకం నిర్వహిస్తామని చెప్పారు. మేయర్ శిరీష, దేవదాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

సురేష్ బాబుకు పురస్కారం



తిరుపతి (కల్చరల్), మార్చి 12: ఓటేరుకు చెందిన ప్రముఖ జ్యోతిష పండితుడు డాక్టర్ సురేష్‌బాబుకు జ్యోతిష్య, వాస్తు పండిట్ పురస్కారం లభించింది. శ్రీపొట్టిశ్రీరాములు విశ్వవిద్యాలయం, యన్ఎస్ లైవ్ ఆస్ట్రో, ఆర్యన్ ఆస్ట్రాలజీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాదులో నిర్వహించిన కార్యక్రమంలో జ్యోతిష బ్రహ్మ డాక్టర్ నరసింహస్వామి ఈ పురస్కారప్రదానం జరిగింది. పొట్టిశ్రీరాములు విశ్వవిద్యాలయంలో 2016లో ఎంఏ ఆస్ట్రాలజీ చదువుకున్న సురేష్ బాబు అదే వర్సిటీ నుంచి అవార్డు అందుకోవడంపై సన్నిహితులు అభినందనలు తెలిపారు.

ఎంఎస్ఎంఈ సర్వేపై శ్రద్ధ పెట్టాలి: కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 12: జిల్లాలో ఎంఎస్ఎంఈ సర్వే ప్రక్రియ, జర్నలిస్టు హౌసింగ్ తదితర అంశాలపై సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి పూర్తి చేయాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, ఈవీఎం, గౌరవ సీఎం లెటర్ డిస్ట్రిబ్యూషన్ తదితర అంశాలపై జేసీ శుభం బన్సల్‌తో కలిసి ఆర్డీవోలు, డీఎల్‌డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. అధికారులు కోదండరామిరెడ్డి, సుశీలాదేవి, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు సన్మానం

ఆడుదాం ఆంధ్ర క్రికెట్ పోటీల్లో ప్రతిభ చూపి చెన్నైలో మెరుగైన శిక్షణకు ఎంపికైన ఏలూరు, విజయనగరం, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన క్రీడాకారులు జస్విన్, ఆనంద్‌పాల్, విష్ణువర్ధినిలను మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సన్మానించారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి సయ్యద్‌సాహెబ్‌నులెజన్ ఆఫీసర్‌గా నియమించారు. డీఎస్ఏ కోచ్‌లు పాల్గొన్నారు.

బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ



పాకాల, మార్చి 12: వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని పులివర్తి నాని సోదరి ధనలక్ష్మి కోరారు. మంగళవారం మండలంలోని ఉప్పరపల్లె పంచాయతీలో 'బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆమె టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటా సూపర్ సిక్స్ పథకాలను ముద్రించిన కరపత్రాలను పంచిపెట్టారు. టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని తెలియజేశారు.

అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు

చంద్రగిరి, మార్చి 12: మండలంలోని పనపాకం, కల్‌రోడ్డుపల్లె, ఎం.కొంగరవారిపల్లె, ఐతేపల్లె, అగరాల, కొటాల, చిన్నరామాపురం, కందులవారిపల్లె, నరసింగాపురం, మిట్టపాళెం, రామిరెడ్డిపల్లె పంచాయతీల్లో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం మంగళవారం జరిగింది. ఇందులో సీసీ రోడ్లు, రైతు భరోసా కేంద్రాలు, వెల్ సమావేశ మందిరాలు, తారు రోడ్లు, గ్రావెల్ రోడ్లు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి, జడ్పీటీసీ యుగంధర్‌రెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ కొటాల చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచులు భాస్కర్‌రెడ్డి, వైసీపీ నాయకుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి పాల్గొన్నారు.





వ్యర్థాలతో నిండిపోయిన రిసెప్షన్ సెంటర్

ఔను.. ఇది రిసెప్షన్ సెంటరే..!

తిరుపతి అర్బన్, మార్చి 12: అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ముందున్న వైఎస్సార్ రిసెప్షన్ సెంటర్ వ్యర్థాలతో నిండిపోయింది. అధికారులు రావడానికి ఆలస్యమైనప్పుడు, ముఖ్యమైన విధుల్లో ఉన్నప్పుడు పనులపై వచ్చే జనం కొంత సమయం వేచి ఉండటానికి ఈ సెంటర్‌ని నిర్మించారు. అయితే ఈ సెంటర్‌ని ఎంపీ ఉప ఎన్నికల సామగ్రితోపాటు పలురకాల వ్యర్థాలను మూటలుగా కట్టి నింపేశారు. దీనివల్ల ఈ సెంటర్ జనానికి ఉపయోగం లేకుండా పోయింది. మరోవైపు తహసీల్దారు కార్యాలయం ఆవరణంలోనూ నిరుపయోగమైన వస్తువులే దర్శనమిస్తున్నాయి. ఇకనైనా దీన్ని వినియోగంలోకి తీసుకొచ్చి.. కార్యాలయ ఆవరణను శుభ్రం చేయాల్సి ఉంది.



కార్యాలయ ఆవరణలో పడేసిన నిరుపయోగమైన వస్తువులు

అక్రమ సంపాదనే తండ్రీకొడుకుల లక్ష్యం

టీడీపీ నగరాధ్యక్షుడి ఆరోపణ



మీడియాతో మాట్లాడుతున్న శంకర్ నాయుడు

తిరుపతి(కపిలతీర్థం), మార్చి 12: వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి, ఆయన కుమారుడు అభినయ్‌రెడ్డి అక్రమ సంపాదనే లక్ష్యంగా పెట్టుకున్నారని టీడీపీ నగర అధ్యక్షుడు శంకర్ నాయుడు ఆరోపించారు. ప్రెస్‌క్లబ్‌లో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. అధికారాన్ని అడ్డు పెట్టుకుని తండ్రీకొడుకులు తిరుమల, తిరుపతిని తమ వ్యాపార కేంద్రంగా మార్చేసి, అక్రమ సంపాదనకు తెరలేపారన్నారు. పవిత్రమైన తిరుమలలో హాకర్ల పేరుతో లైసెన్సులను రూ.కోట్లకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారన్నారు. నగరంలో కొత్త రోడ్ల పేరుతో ఎంతోమంది కడుపుకొట్టి, వారికి అనుకూలమైన, ఆదాయపరమైన రోడ్లు వేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరి రాజకీయ స్వార్థం కోసం శెట్టిపల్లె పంచాయతీని కార్పొరేషన్‌లో విలీనంచేసి.. అక్కడి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని చెప్పారు. పైగా శెట్టిపల్లె భూ సమస్యను పరిష్కరించాలంటే తమకు ఓటు వేసి, గెలిపించాలని భయపెడుతున్నారని మండిపడ్డారు. ఈ విషయంపై ఇటీవల శెట్టిపల్లె ప్రజలు ఎస్పీకి సైతం ఫిర్యాదు చేశారని గుర్తుచేశారు. ఈ తండ్రీకొడుకులకు ప్రజలు తమ ఓటుతో సరైన బుద్ధి చెప్పి.. ఇంటికి సాగనంపుతారని స్పష్టం చేశారు. టీడీపీ నేతలు రేవతి, లక్ష్మి, తులసి, దామా మురళి, నరేష్‌కుమార్, ప్రతాప్, మునిరాజా, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గుర్తు లేకుండా ఎన్నికలకా?

బాధాకరమన్న పార్టీ నేతలు



తిరుపతి (కపిలతీర్థం), మార్చి 12: 'ఎంతో పవిత్రమైన, టీడీపీకి ఆది నుంచి సెంటిమెంట్‌గా ఉన్న తిరుపతిలో ఈసారి పార్టీ గుర్తు లేకుండా ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికలకు వెళ్లడం బాధాకరం' అని టీడీపీ శ్రేణులు ఆవేదన వ్యక్తం చేశాయి. ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం టీడీపీ నేత బుజ్జిబాబు నాయుడు మీడియాతో మాట్లాడుతూ.. పార్టీ చరిత్రలో ఎప్పుడూ ఇటుంటి పరిస్థితి లేదన్నారు. అధిష్ఠానం నిర్ణయాన్ని తాము తప్పుపట్టడం లేదని.. ఓసారి పునరాలోచించాలని కోరారు. పైగా టీడీపీ గుర్తు లేకుండా పోటీచేస్తే చేదు అనుభవాలు ఎదురయ్యే పరిస్థితి ఉందని అభిప్రాయపడ్డారు. టీడీపీ నేతలు లక్ష్మీపతి నాయుడు, సుబ్బరాయులునాయుడు, సురేంద్ర నాయుడు, నాగేంద్ర కుమార్, మణ్యం శ్రీనివాసులు, జీడీ నాయుడు, మధు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వహించాలి : కలెక్టర్



ప్రసంగిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 12: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో నోడల్ అధికారులు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి లక్ష్మీశ ఆదేశించారు. మంగళశారం కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్‌తో కలిసి అధికారులకు పలు సూచనలిచ్చారు. డీఆర్వో పెంచలకిషోర్, ఎన్నికల సూపరింటెండెంట్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ అనుబంధ శాఖలపై సమీక్ష

వ్యవసాయ అనుబంధ శాఖలపై కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్ సమీక్షించారు. ఉద్యాన, ఏపీఎంఐపీ, సెరికల్చర్, ఫిషరీస్, మార్కెటింగ్ శాఖలపై సంబంధిత అధికారులకు పలు సూచనలిచ్చారు. రాష్ట్రంలో ఈ-క్రాప్ కేవైసీలో జిల్లా ముందుందని తెలిపారు. అధికారులు ప్రసాదరావు, సతీష్, దశరథరామిరెడ్డి, గీతారాణి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి- కొల్లం మధ్య రైలు ప్రారంభం



సభలో ప్రసంగిస్తున్న ఎంపీ గురుమూర్తి

తిరుపతి సెంట్రల్, మార్చి 12: తిరుపతి - కొల్లం మధ్య ఎక్స్‌ప్రెస్ రైలును, తిరుపతి రైల్వేస్టేషన్‌లో జన ఔషధి దుకాణాన్ని పీఎం నరేంద్ర మోదీ ఢిల్లీ నుంచి మంగళవారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా తిరుపతి రైల్వేస్టేషన్‌లో అధికారులు ఏర్పాటు చేసిన సభలో ఎంపీ గురుమూర్తి ప్రసంగించారు. తిరుపతి పుణ్యక్షేత్రానికి మరికొన్ని నూతన ఎక్స్‌ప్రెస్ రైళ్లు మంజూరు చేయాలని కోరారు. బీజేపీ నాయకులు పీసీ రాయలు, సామంచి శ్రీనివాస్, స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, ఎస్ఎంఆర్ కె.చిన్నప్పరెడ్డి, నాయకులు గుండాల గోపినాథ్‌రెడ్డి, ఎం.శేఖర్, పి.చంద్రశేఖర్, రవి, అనూష తదితరులు పాల్గొన్నారు.

రెండ్రోజుల్లోనే..: మంగళ, శుక్రవారాల్లో తిరుపతి నుంచి కొల్లంకు కొత్త రైలు బయల్దేరుతుంది. తిరుపతిలో ఈ ఎక్స్‌ప్రెస్ రైలు (17421) మధ్యాహ్నం 2.40 గంటలకు బయల్దేరి.. చిత్తూరు, కాట్పాడి, జోలార్‌పేట్, సేలం, ఈరోడ్, తిర్‌పూర్, కోయంబుత్తూర్, పాల్కాడ్‌ల మీదుగా మరుసటి రోజు ఉదయం 6.20 గంటలకు కొల్లాంకు చేరుకుంటుందని అధికారులు తెలిపారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.66 కోట్లు

తిరుమల,మార్చి12(ఆంధ్రజ్యోతి):తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.66 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయం లభించినట్టు మంగళవారం ఉదయం ప్రకటించింది. ఇక, సోమవారం 64,802 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 21,695 మంది తలనీలాలు సమర్పించారు.

టీడీపీ బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీకి సన్మానం



మంగళం, మార్చి 12: టీడీపీ బీసీసెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్.శ్రీనివాసులు యాదవ్‌ను మంగళవారం సన్మానించారు. ఓ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో హైదరాబాదుకు చెందిన ఎన్టీఆర్ ట్రస్టు సభ్యుడు తాటిశెట్టి శ్రీనివాసులుయాదవ్, కర్నూలుకు చెందిన ఎంఎస్ పుల్లయ్యయాదవ్, వి.జయకుమార్, నాగభూషణం, సుధాకర్, సురేంద్రబాబు పాల్గొన్నారు.

భాషాభివృద్ధిలో ఏఐ

భారతీయ భాషా సమ్మేళనంలో భాషా పండితుడు సుదర్శన బేలూరు



తిరుపతి(రూరల్), మార్చి 12: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), చాట్ జీపీటీ వంటి అధునాతన సాంకేతికత ద్వారా భాషను అభివృద్ధి పరచుకోవచ్చని కర్ణాటకకు చెందిన భాషాపండితుడు సుదర్శన బేలూరు తెలిపారు. తిరుపతిలోని జాతీయ సంస్కృతవర్సిటీలో భారతీయ భాషా సమితి, ఏపీ సంస్కృత భారతి సంయుక్త అధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన భారతీయ భాషా సమ్మేళనం జాతీయ సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవడం ఎలాగో వివరించారు. ఏపీ తెలుగు, సంస్కృత అకాడమీ అధ్యక్షురాలు లక్ష్మీపార్వతి అకాడమీ సేవలను వివరించారు. సంస్కృత వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ.. సంస్కృతంతో పాటు భారతీయ భాషలను సంరక్షించాలన్న ఉద్దేశంతో ఈసదస్సు నిర్వహించామని అన్నారు. కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్ఎల్ సీతారామశర్మ, అడిషినల్ కోఆర్డినేటర్ డాక్టర్ కనపాలకుమార్, వివిధ భాషలకు చెందిన పరిశోధకులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మేమున్నాం.. నిర్భయంగా ఓటేయండి

కేంద్ర, పోలీసు బలగాల కవాతు



తిరుపతి క్రైం, మార్చి 12: 'ఎవరి ఓటు హక్కు వారు వినియోగించుకోండి. ఎవరూ భయపడాల్సిన పనిలేదు. ఎన్నికలు పూర్తయ్యే వరకు మీ వెంటే మేముంటాం' అని అలిపిరి సీఐ రామచంద్రా రెడ్డి తెలిపారు. ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ ఆదేశాల మేరకు మంగళవారం డీఎస్పీ సురేంద్ర రెడ్డి నేతృత్వంలో అలిపిరి పరిధిలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలున్న ప్రాంతాలైన జీవకోన, లీలామహల్ సర్కిల్ నుంచి సత్యనారాయణపురం, రాఘవేంద్ర నగర్, అంబేడ్కర్ నగర్, అక్కడినుంచి మున్సిపల్ పార్కు వరకు రెండు ప్లటూన్ల కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు.

మహిళా వర్సిటీలో మలేసియా విద్యార్థులు



మలేసియా విద్యార్థులతో వీసీ భారతి, రిజిస్ట్రార్ రజని

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 12: పద్మావతి మహిళా యూనివర్సిటీకి మలేసియాకు చెందిన ఐదుగురు విద్యార్థినుల బృందం వచ్చింది. మూడు నెలల పాటు వర్సిటీలో వారు ఇంటర్న్‌షిప్‌చేయనున్నారు. బయో ఇంజనీరింగ్, అగ్రి బయోటెక్నాలజీ, ఆర్-డీఎన్ఏ టెక్నాలజీ, క్లినికల్ బయోకెమిస్ట్రీ, ఇమ్యూనాలజీ, ఓమిక్స్ వంటి అంశాల్లో శిక్షణ పొందుతారు. వీరికి వీసీ భారతి, రిజిస్ట్రార్ రజని స్వాగతం పలికారు. వర్సిటీ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు సంతరించుకుందని చెప్పడానికి వీరి రాకే నిదర్శనమని చెప్పారు. పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

ఏసీబీ డీఎస్పీగా రవిమనోహరాచారి



తిరుపతి క్రైం, మార్చి 12: తిరుపతి ఏసీబీ డీఎస్పీగా రవిమనోహరాచారి నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం తిరుపతి ఎస్పీ, ఏసీబీ కార్యాలయానికి ఉత్తర్వులు అందాయి. గతంలో ఈస్ట్ సీఐగా, తిరుమల, తిరుపతి ఎస్పీ డీఎస్పీగా, మదనపల్లె డీఎస్పీగా కూడా పనిచేశారు. అక్కడి నుంచి పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురానికి బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఉమ్మడి చిత్తూరు జిల్లాకు తిరుపతిలో ఉన్న ఏసీబీ కార్యాలయానికి డీఎస్పీగా బదిలీపై వస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. గతంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పలు చోట్ల పనిచేసిన అనుభవం ఉందన్నారు. శ్రీవారి పాదాల చెంత పనిచేయడం అదృష్టంగా భావిస్తానని చెప్పారు.

ఆరుగురు 'ఎర్ర' స్మగ్లర్ల అరెస్టు



మంగళం, మార్చి 12: చంద్రగిరి సమీపంలోని భాకరాపేట అటవీప్రాంతంలో గొడ్డళ్లు, రంపాలతో చొరబడుతున్న ఆరుగురు ఎర్రచందనం స్మగ్లర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఆర్ఐ సురేష్ కుమార్ రెడ్డికి చెందిన ఏఆర్ ఎస్ఐ మహేశ్వర నాయుడు టీమ్ భాకరాపేట అనంతపురం హైవేలోని ఓ ప్రైవేటు కాలేజ్ ఎదురుగా ఉన్న అడవుల్లో కూంబింగ్ చేపట్టారు. అక్కడ కొందరు వ్యక్తులు అడవుల్లోకి చొరబడుతుండగా చుట్టుముట్టారు. పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేయగా, ఆరుగురిని పట్టుకున్నారు. వీరిని సత్యసాయి జిల్లాకు చెందిన ఆనేవాళ్ల హరి (43), తిరుపతి రూరల్‌కు చెందిన మురుగయ్య (27), తమిళనాడు కళ్లకురిచ్చికి చెందిన వేల్ మురుగన్ (46), ఏలుమలై (46), మురుగన్ తంగవేల్ (37), మహేంద్రన్ మురుగేషన్ (46)లుగా గుర్తించారు. తప్పించుకున్న మరో ఆరుగురు కోసం గాలిస్తున్నారు. పట్టుబడ్డ వారి నుంచి మూడు బస్తాల్లో గొడ్డళ్లు, రంపాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసు స్టేషన్‌లో నమోదు చేయగా సీఐ శ్రీనివాసులు దర్యాప్తుచేస్తున్నారు.

ఇంటర్ పరీక్షలకు 954మంది గైర్హాజరు

తిరుపతి(విద్య),మార్చి12: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర పబ్లిక్ పరీక్షలకు మంగళవారం జిల్లాలో 954మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆర్ఐవో జీవీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. జనరల్, ఒకేషనల్ విభాగంలో 33,848 మందికిగాను 32,894 మంది హాజరయ్యారన్నారు. ఇందులో జనరల్‌లో 32,463 మందికిగాను 31,629 మంది హాజరవగా, 834మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. ఒకేషనల్‌లో 1385 మందికిగాను 1265 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 120మంది గైర్హాజరైనట్లు వివరించారు.

జిల్లాస్థాయి రెజ్లింగ్ జట్టు ఎంపిక



తిరుపతి(క్రీడలు), మార్చి 12: శ్రీనివాస క్రీడా సముదాయంలో మంగళవారం జిల్లాస్థాయి అండర్-20 రెజ్లింగ్ జట్టును ఎంపిక చేశారు. జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా క్రీడాకాధికారి సయ్యద్‌సాహెబ్, ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వై.ప్రవీణ్, ఆర్.శ్రీధర్ హాజరయ్యారు.

జట్టు వివరాలిలా..

బి.సాయితేజ, ఎ.హేమంత్, ఎన్.గోపి, కె.భార్గవ్‌నందకుమార్, పి.సుమన్, టి.మహేష్, ఎ.ఆనంద్, డి.లీలామోహన్, పృథ్వి, ఎన్.జ్యోతిప్రకాష్, పి.కార్తీక్, ఎస్.మహేష్, ఎ.నాగరాజు, బి.రాజేష్ ఉన్నారు. వీరంతా ఈనెల 20, 21 తేదీల్లో చిత్తూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారని అసోసియేషన్ కార్యదర్శి ఉదయ్‌కుమార్ తెలిపారు.

కొండ బస్సుల్లో నిషేధాల తరలింపుపై విచారణ !

తిరుపతి అర్బన్, మార్చి 12: వైసీపీ సిద్ధం సభకు జనాన్ని తీసుకెళ్లిన బస్సులు నిషేధిత పదార్థాలతో తిరుమలకు చేరిన సంఘటనపై ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి విచారణకు ఆదేశించినట్లు సమాచారం. తిరుమల పవిత్రత దెబ్బతినేలా వ్యవహరించారంటూ డిపో మేనేజర్ స్థాయి అధికారితో విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని కోరారు. సభ నుంచి తిరుగుముఖం పట్టిన సమయంలోనే డ్రైవర్లకు తిరుపతిలోనే బస్సులను శుభ్రం చేసి కొండకు తీసుకురావాలని ఫోన్ ద్వారా తిరుమల డిపో మేనేజర్ సూచించారు.అయినా పట్టించుకోకుండా బస్సులను తిరుమలకు తెచ్చిన డ్రైవర్లను సమగ్రంగా విచారించనున్నారు.ఈ ఘటనతో తిరుమల ఘాట్‌లో నడిచే సప్తగిరి బస్సులను ఇకపై ఆధ్యాత్మిక, పుణ్యక్షేత్రాల ప్రయాణాలకు మినహా ఇతర కార్యక్రమాలకు, ప్రధానంగా రాజకీయ ప్రచారాలకు ఉపయోగించకూడదన్న నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం.

జనసేనలో చేరిన హరిప్రసాద్



తిరుపతి అర్బన్, మార్చి 12: తిరుమలకు చెందిన కులాల హరిప్రసాద్ మంగళవారం జనసేనలో చేరారు. గతంలో ఆయన ప్రజారాజ్యం, తెలుగుదేశం పార్టీలలో క్రియాశీలకంగా వ్యవహరించారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. తిరుపతి ఇన్‌చార్జి కిరణ్‌రాయల్ పాల్గొన్నారు.

రేపు తెలుగు సమాజం - ఆధునికతపై సదస్సు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 12: తెలుగు సమాజం - ఆధునికత అంశంపై ఎస్వీ యూనివర్సిటీ ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియంలో గురువారం సదస్సు జరగనుంది. ప్రముఖ చరిత్రకారులు ప్రొఫెసర్ వకుళాభరణం రామకృష్ణ ప్రసంగిస్తారు. ఈ మేరకు తిరుపతి పౌర చైతన్య వేదిక అధ్యక్ష, కార్యదర్శులు వాకా ప్రసాద్, కుమార్ రెడ్డి తెలిపారు.

క్రికెట్ పోటీల్లో విజేత సీఅండ్‌డబ్ల్యూ జట్టు



తిరుపతి సెంట్రల్, మార్చి 12: ఆలిండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రైల్వే ఉద్యోగులకు నిర్వహించిన క్రికెట్ పోటీల్లో విజేతగా కోచ్ అండ్ వ్యాగన్ (సీ అండ్ డబ్ల్యూ) విభాగం జట్టు విజేతగా నిలిచిందని గుంతకల్లు డివిజన్ అధ్యక్షుడు కె.సుదర్శన్ రాజు తెలిపారు. తమ ఫెడరేషన్ శతాబ్ది ఉత్సవాలు సందర్భంగా డివిజన్ పరిధిలో ఉద్యోగులకు అగ్రికల్చరల్ క్రీడామైదానంలో క్రికెట్ పోటీలు నిర్వహించామన్నారు. ఫైనల్స్‌లో ఎలక్ట్రికల్ ఆపరేటింగ్ జట్టుపై సీఅండ్‌డబ్ల్యూ జట్టు విజయం సాధించిందన్నారు. విజేతలకు ట్రోఫీని మంగళవారం రైల్వేస్టేషన్‌లో డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ అందజేశారు. టెక్నికల్ బ్రాంచ్ కార్యదర్శి రవీంద్ర నాయక్, నారాయణ స్వామి పాల్గొన్నారు.

ఎలక్టోరల్ బాండ్ల వివరాలు బహిర్గతం చేయాలి: సీపీఐ



ఎస్బీఐ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

తిరుపతి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఎలక్టోరల్ బాండ్ల వివరాలు బహిర్గతం చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఎస్బీఐ మెయిన్ బ్రాంచ్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామానాయుడు, జిల్లా కార్యదర్శి పి.మురళి ప్రసంగించారు. రూ.వెయ్యి నుంచి రూ.కోటి వరకు ఎలక్టోరల్ బాండ్లను బ్యాంకు నుంచి కేవైసీ ధ్రువీకరించిన ఖాతాదారులు కొనుగోలు చేయవచ్చన్నారు. వీటిని తమకు నచ్చిన పార్టీకి అందించవచ్చని చెప్పారు. ఈ బాండ్‌పై దాత పేరు ఉండదు.. వివరాలు బ్యాంకు వద్ద మాత్రమే ఉంటాయని చెప్పారు. అందువల్ల బాండ్ల వివరాలు బహిర్గతం చేయాలని కోరారు.

తిరుమలేశుడి సేవలో రజనీకాంత్ కుమార్తెలు



ఐశ్వర్య, సౌందర్య

తిరుమల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీనటుడు రజనీకాంత్ కుమార్తెలు ఐశ్వర్య, సౌందర్య మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన వీరు ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

ఎన్ఎస్‌యూ వీసీకి జాతీయ అవార్డు



తిరుపతి(రూరల్), మార్చి 12: జాతీయ సంస్కృత వర్సిటీ (ఎన్ఎస్‌యూ) వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తిని తెలంగాణ రాష్ట్రంలో కరీంనగర్‌కి చెందిన సర్వవైదిక సంస్థానం ఆధ్వర్యంలో మంగళవారం శ్రీభాష్యం విజయసారథి జాతీయ అవార్డుతో సన్మానించారు. తెలంగాణ రాష్ట్ర సంస్కృత పండితులు పాల్గొన్నారు.

తిరుమలలో టూరిజం హోటళ్ల ప్రారంభం



అన్నమయ్య భవనంలో హోటల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి రోజా

తిరుమల, మార్చి 12(ఆంధ్రజ్యోతి): తిరుమలకు వచ్చే శ్రీవారి భక్తుల సౌకర్యార్థం ఏపీ టూరిజం మూడు హోటళ్లను ప్రారంభించింది. అన్నమయ్య భవనం, నారాయణగిరి, బాలాజీ బస్టాండ్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఈ హోటళ్లను ఏపీ టూరిజం చైర్మన్ వరప్రసాద్ రెడ్డి, ఎండీ కన్నబాబుతో కలిసి మంత్రి రోజా మంగళవారం ఉదయం ప్రారంభించారు. మంత్రి మీడియాతో మాట్లాడుతూ..భక్తులకు నాణ్యమైన ఆహారాన్ని తక్కువ ధరకే అందించాలన్నఉద్దేశంతో హోటళ్లను ఏర్పాటు చేశామన్నారు. టీటీడీ బోర్డు ఆమోదం, నిర్ణయించిన ధరలతో హోటళ్లను అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు.

టీటీడీ ఇళ్ల పట్టాల పంపిణీ



ఉద్యోగినికి ఇంటి పట్టా అందజేస్తున్న టీటీడీ చైర్మన్, ఈవో

తిరుపతి క్రైం, మార్చి 12: మహతి ఆడిటోరియంలో టీటీడీ ఉద్యోగులకు మూడో విడత ఇళ్ల పట్టాలను మంగళవారం పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా టీటీడీ చైర్మన్ కరుణాకరరెడ్డి పాల్గొన్నారు. ఈవో ధర్మారెడ్డితో కలిసి 4వేల మంది ఉద్యోగులు, పెన్షనర్లకు ఇంటిస్థలం ప్రొసీడింగ్స్ అందజేశారు. చైర్మన్ మాట్లాడుతూ.. వడమాలపేట, పాదిరేడు అరణ్యం వద్ద రెండు విడతల్లో 432 ఎకరాల్లో 5221 మంది ఉద్యోగులకు ఇంటి స్థలాలు కేటాయించామన్నారు. ప్రస్తుతం ఏర్పేడు మండలం పల్లం వద్ద ఉద్యోగులకు, సర్వీస్ పెన్షనర్లకు, ఫ్యామిలీ పెన్షనర్లకు కలిపి 4వేల మందికి ఇంటి స్థలాలు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. ఈవో మాట్లాడుతూ.. పల్లం వద్ద 723 మంది ఉద్యోగులకు, 3277 మంది పెన్షనర్లకు కలిపి 4,000 మందికి ఇంటి స్థలాల కేటాయిస్తున్నామని తెలియజేశారు. 2015వ సంవత్సరం వరకు చేరిన రెగ్యులర్ ఉద్యోగుల్లో 800 మంది, పెన్షనర్లు 1,780 మంది ఇంకా మిగిలారని చెప్పారు. పల్లం వద్ద ప్రస్తుతం 100 ఎకరాలు మిగులుగా ఉందని, మరో 200 ఎకరాలు ప్రభుత్వం నుంచి కొనుగోలు చేసి మిగిలిన 2580 మంది ఉద్యోగులు, పెన్షనర్లకు ఇంటి స్థలాలు కేటాయిస్తామని స్పష్టం చేశారు. ఉద్యోగుల ఇంటి స్థలాల కోసం ఇప్పటి వరకు దాదాపు రూ.240 కోట్లు టీటీడీ ఖర్చు చేసిందని తెలిపారు. ఉద్యోగులు ఇప్పటివరకు రూ.85 కోట్లు టీటీడీకి తిరిగి చెల్లించారని, మిగిలిన ఉద్యోగులందరూ టీటీడీకి సొమ్ము చెల్లించి రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని కోరారు. టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, సంక్షేమ విభాగం డిప్యూటీ ఈవో స్నేహలత, ఇతర అధికారులు, ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని నట్టేట ముంచింది: పాశం



టీడీపీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, మార్చి 12: ఒక్కచాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని నట్టేటముంచిందని, రానున్న ఎన్నికలలో వైసీపీని గద్దె దించాలని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని వెందోడు గ్రామంలో శంఖారావం - సూపర్‌సిక్స్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం గ్రామానికి చెందిన పలువురు టీడీపీలో చేరడంతో వారికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం సాగిస్తున్న అరాచకపాలనతో ప్రజలు విసిగిపోయారన్నారు. అవినీతిని ప్రశ్నించే వారిపై అక్రమకేసులు బనాయించి వేధిస్తున్నారని మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వంలో ఒక్క అభివృద్ధి పని జరగలేదన్నారు. పేదలకు అండగా నిలిచేది, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేది టీడీపీయేనని అన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీకి బుద్ధిచెప్పి టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో హరిచంద్రారెడ్డి, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు రాజు, మట్టం శ్రావణి, రవిరెడ్డి, మధురెడ్డి, శ్రీనివాసులరెడ్డి, చెంచయ్య, వెంకయ్య, మల్లికార్జున, భాస్కర్, అమరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానంతో అంధుల జీవితాల్లో వెలుగు



రాజానాగేశ్వరరావు

గూడూరు, మార్చి 12: నేత్రదానంతో అంధుల జీవితాల్లో వెలుగు నింపిన వారమవుతామని సునీత సేవాసంస్థ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సారంగం శ్రీనివాసులు, సారంగం సులక్ష్మి అన్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ స్థానిక వెంకటేశ్వర స్వామి ఆలయ సమీప ప్రాంతానికి చెందిన రాజానాగేశ్వరరావు మృతిచెందడంతో ఆయన నేత్రాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు అంగీకరించారు. నెల్లూరుకు చెందిన మోడరన్ కంటి ఆస్పత్రి వైద్యులచే నేత్రాలను సేకరించారు. తమ సంస్థ ఆధ్వర్యంలో ఇది 14వ నేత్రదానమని సునీత సేవాసంస్థ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తెలిపారు.

బీసీలకు అండగా నిలిచేది టీడీపీనే: తెలుగు మహిళలు

చిల్లకూరు, మార్చి 12: బీసీలకు అండగా నిలిచేది టీడీపీయేనని తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండాల లీలావతి అన్నారు. మంగళవారం మండలంలోని కాకువారిపాళెం గ్రామంలో బీసీలకు చంద్రబాబు ప్రకటించిన వరాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ ఆది నుంచి బీసీల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు పరుస్తోందన్నారు. అలాగే స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 34శాతం రిజర్వేషన్ కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో బీసీలందరూ టీడీపీకి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, మునిశేఖర్‌గౌడ్, కుమార్‌యాదవ్, సతీష్‌యాదవ్, ప్రవీణ్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అవిర్భావ దినోత్సవంలో వర్గపోరు

● మరోసారి బయట పడ్డ విభేదాలు

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 12: మండలంలో వైసీపీ అవిర్భావ దినోత్సవాన్ని స్థానిక నాయకులు రెండు వర్గాలుగా విడిపోయి మంగళవారం జరుపున్నారు. దీంతో పార్టీలో వర్గ విభేదాలు మరోసారి బయట పడ్డాయి. ఎమ్మెల్యే ఆదిమూలం ఉన్నప్పుడు మండలంలో మండల పార్టీ కన్వీనర్ విద్యానాథరెడ్డి తీరుతో వైసీపీలో రెండు గ్రూపులు ఉన్న విషయం విదితమే. అయితే గత ఆరు నెలలుగా పార్టీ కార్యక్రమాలను రెండు గ్రూపులుగా నిర్వహిస్తుండటంతో కార్యకర్తలు అసహనం వక్తం చేస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పార్టీ అవిర్భావ దినోత్సవాన్ని మండల పార్టీ కన్వీనర్ నీర్పాకోట వైఎస్ఆర్ విగ్రహం దగ్గర నిర్వహించగా, బీఎన్‌కండ్రిగ బస్టాండు దగ్గర వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు గోపాల్‌రెడ్డి, రవిరెడ్డి, గురునాథ్బం, గురవయ్య నిర్వహించారు. ఈ పరిణామం పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లింతుందని పలువురు పార్టీ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కేవీబీపురంలో...

వైసీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని మండల వైసీపీ అధ్యక్షుడు గవర్ల కృష్ణయ్య, అధ్వర్యంలో పార్టీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. వైఎస్ విగ్రహానికి నివాళులర్పించి కేకులు కట్ చేసి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో నాయకులు నందకుమార్, మాధవి రెడ్డి, శాస్త్రి రాజు, చిరంజీవి, జాకీర్ హుసెన్, లోకేష్, బాలజీ, రామోహన్ వర్మ, రమేష్, శ్రీనివాసులు, రాధ తదితరులు పాల్గొన్నారు.

కేవీబీపురంలో పోలీస్ దళం కవాతు

కేవీబీపురం మార్చి12: ఎన్నికలు సమీపిస్తుండంతో మండల కేంద్రంలో మంగళవారం పుత్తూరు డీఎస్పీ రూరల్ శ్రీనివాసులు అధ్వర్యంలో 100మంది బీఎస్ఎఫ్ దళం కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ భాస్కర్ నాయక్, బీఎస్ఎఫ్ డీఎస్పీ జితేంద్ర సింగ్, ట్రైని డీఎస్పీ సింధు ప్రియ, పిచ్చాటూరు ఎస్ఐ వెంకటేష్, ఏఎస్ఐ లోకనాథం, పోలీస్ సిబ్బంది నాయుడు, గంగధార్, దయకార్, కలం, ఆశోక్ తదితరులు పాల్గొన్నారు.



పుత్తూరు వార్తలు

వైద్య సేవలపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న కీల్‌కారి వైద్య సిబ్బంది

నారాయణవనం, మార్చి 12: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం మండల పరిధిలోని ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలకు కీల్‌కారి మొబైల్ అకాడమీ హెల్త్ టీం గర్భిణులు, గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడంలో శిక్షణ ఇచ్చారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజు, కీర్తి, పీహెచ్‌సీ వైద్యులు దర్శిత్‌రాజ్, రాఘసుధ, సీహెచ్‌వో శ్రీనివాసులు, రామచంద్రయ్య, ఆరోగ్య కార్తకర్త సుధాకర్, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

పుత్తూరు టౌన్, మార్చి 12: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జేకేసీ, సీసీఈ, ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో ఈ నెల 16న నిర్వహించనున్న జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులురెడ్డి కోరారు. జాబ్ మేళాకు తృతీయ సంవత్సరం డిగ్రీ చదువుతున్న విద్యార్థులు హాజరుకావచ్చని తెలిపారు. అభ్యర్థులు వారి బయోడేటా, ఫొటోలు తీసుకుని రావాలని సూచించారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

అనుమతి లేని చర్చి నిర్మాణాన్ని అడ్డుకోండి

వెంకటగిరి టౌన్, మార్చి 12: మున్సిపాలిటీలోని సుదర్శన్ నగర్‌లో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా చేపట్టిన చర్చి నిర్మాణాన్ని అడ్డుకోవాలని స్థానికులు మున్సిపల్ మేనేజర్ రాజ్యలక్ష్మికి మంగళవారం వినతిపత్రం అందించారు. స్పందించిన ఆమె అక్రమంగా చర్చి నిర్మిస్తుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. సంబంధిత అధికారులకు అర్జీని అందజేసి పూర్తి వివరాలు పరిశీలించాలని ఆదేశించారు.

నిబంధనలు పాటించండి

నాయుడుపేట, మార్చి 12: గ్యాస్ పైపులైన్ తవ్వకాల్లో నిబంధనలు పాటించాలని మున్సిపల్ కమిషనర్ జనార్దన రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం ఏజీపీ పైప లైన్ రీజనల్ డిప్యూటీ హెడ్ అనిల్‌కుమార్, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ గౌతమ్ ఆనంద్‌తో కమిషనర్ మాట్లాడారు. పైపులైన్ కోసం తవ్విన గుంతలను కాంక్రీట్‌తో పూడ్చివేయాలని, లేకుంటే ఏజీపీ బ్యాంక్ గ్యారెంటీ క్లెమ్ చేస్తామన్నారు.

అభివృద్ధి చేయకుండా ఓట్లెలా అడగాలి?

మున్సిపల్ మీట్‌లో కౌన్సిలర్ల ఆవేదన



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ శ్రీమంత్ రెడ్డి - సమస్యలను ప్రస్తావిస్తున్న కౌన్సిలర్ లక్ష్మమ్మ

సూళ్లూరుపేట, మార్చి 12: మున్సిపాలిటీ పాలక వర్గం ఏర్పడి మూడేళ్లయ్యింది. కనీసం వార్డులో చిన్నపాటి అభివృద్ధి పనులు చేయకుండా త్వరలో జరిగే ఎన్నికల్లో ప్రజలను ఓట్లు ఎలా అడగాలంటూ వైసీపీ కౌన్సిలర్లు ఆవేదన వెళ్లగక్కారు. మంగళవారం స్థానిక స్త్రీ స్వశక్తి భవనంలో మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్ రెడ్డి అధ్యక్షతన, కమిషనర్ గంగాప్రసాద్ ఆధ్వర్యంలో సాధారణ కౌన్సిల్ సమావేశం జరిగింది. 6వ వార్డు కౌన్సిలరు ముత్తుకూరు లక్ష్మమ్మ మాట్లాడుతూ తన వార్డులో పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉందని, ఇళ్ల ముందు, రోడ్లపై మురుగు పారుతోందని పలుసార్లు అధికారులకు విన్నవించుకొన్నా పట్టించుకోలేదని, అనేకసార్లు కౌన్సిల్ సమావేశంలో చర్చించినా ఫలితం లేదన్నారు. ఇలాగైతే ఓట్లు వేసిన ప్రజలకు తాము ఏమి సమాధానం చెప్పాలంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తన వార్డులో డ్రైనేజీ సమస్య పరిష్కరించక పోతే మున్సిపాలిటీ కార్యాలయం ముందు ధర్నాకు దిగుతానని అల్టిమేటం ఇచ్చారు. కౌన్సిలర్లు సౌజన్య రెడ్డి, మీజూరు రామకృష్ణ రెడ్డి, మునిప్రసాద్, బందిల మహేశ్వర్ తదితరులు మాట్లాడుతూ తాము గెలిచి మూడేళ్లయిన వార్డుల్లో ఎటువంటి అభివృద్ధి పనులు చేయలేదని, సమస్యల ఫొటోలను ప్రజలు తమకు పంపి ప్రశ్నిస్తున్నారని, వారికి ఏమి సమాధానం చెప్పాలంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాగైతే త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజల్లోకి వెళ్లి ఓట్లు ఎలా అడగాలని అన్నారు. వేసవిలో ముందుగా తాగునీటిపై దృష్టిపెట్టామని, సమస్య ఉన్నచోట అవసమైతే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామని కమిషనర్ చెప్పారు. మొత్తం అజెండాలోని 6 అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు.

దౌర్జన్యానికి దిగితే తగిన బుద్ధిచెబుతాం: నెలవల



సమావేశంలో మాట్లాడుతున్న నెలవల సుబ్రహ్మణ్యం

ఓజిలి, మార్చి 12: అధికారం అండచూసుకుని వైసీపీ మూకలు దౌర్జన్యానికి దిగితే తగిన బుద్ధి చెబుతామని సూళ్లూరుపేట నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. ఓజిలి మండలం కురుగొండలో మంగళవారం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నెలవల విజయశ్రీకి మద్దతుగా పార్టీ నాయకులు పెద్దఎత్తున ప్రచారం చేపట్టారు. ఉదయం 11 గంటలకు కురుగొండకు చేరుకున్న విజయశ్రీ, నెలవల సుబ్రహ్మణ్యం గ్రామంలోని వరసిద్ది వినాయక దేవాలయంలో పూజలు చేశారు. కరపత్రాలను స్వామివారి పాదాల చెంత ఉంచి ప్రచారాన్ని ప్రారంభించారు. అలాగే దళితకాలనీలో ఉన్న మాతమ్మ ఆలయం, గ్రామంలోని సాయి బాబా ఆలయం, నాగారపమ్మ ఆలయాల్లో పూజలు నిర్వహించారు. ఇంటింటా పర్యటించి టీడీపీని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా కురుగొండకు చెందిన టీడీపీ నేత శ్రీనివాసులురెడ్డి ఇంటివద్ద విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థి విజయశ్రీతో నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను శాంతియుతంగా జరిగేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. దౌర్జన్యం చేసి గెలవాలని కుట్రలకు పాల్పడితే తాము కూడా ధీటుగా ఎదుర్కొంటామని హెచ్చరించారు. దుష్టపాలన అంతమొందించడమే తమ ముందున్న కర్తవ్యమని, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందని నెలవల అన్నారు. కార్యక్రమంలో ఓజిలి, నాయుడుపేట, పెళ్లకూరు మండలాల టీడీపీ కన్వీనర్లు విజయకుమార్ నాయుడు, కందల కృష్ణారెడ్డి, సంచి కృష్ణయ్య, యూనిట్ ఇన్‌చార్జి పాదర్తి ప్రకాష్ నాయుడు, నాయుడుపేట ఏఎంసీ మాజీ ఛైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, నియోజకవర్గ అధికారప్రతినిధి సుధాకర్‌రెడ్డి, తిరుపతి పార్లమెంటు బీసీ సెల్ ఉపాధ్యక్షుడు పాడి వెంకటసుబ్బయ్య, నాయుడుపేట మున్సిపల్ వైస్ ఛైర్మన్ రఫీ, మాజీ జడ్పీటీసీ సభ్యుడు రామయ్య తదితరులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు రామాయణ ప్రదర్శన



విద్యార్థులకు రామాయణం గురించి వివరిస్తున్న ఉపాధ్యాయుడు

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 12: ఈ నెల 18 నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల సన్నద్ధంలో భాగంగా మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో రామాయణాన్ని విద్యార్థులకు టీవీ ద్వారా మంగళవారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయులు యువశ్రీ మురళి మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు పాఠ్యాంశంలో రామాయణం ఉందని, తెలుగు ప్రశ్న పత్రంలో సంఘటనలు, పాత్ర స్వభావం, వ్యాసరూప ప్రశ్నలతో పాటు20 మార్కులకు ఈ ఉపవాచకం రామాయణం నుంచి అడుగుతారని, ఇప్పటికే రామాయణం, బోధన వివరించగా, ఒకసారి విద్యార్థులకు చిత్రాన్ని ప్రత్యక్షంగా కథనాత్మక రూపంలో చూస్తే ఉపయుక్తం గుర్తుంటుదని తెలిపారు.

టెన్త్ పరీక్షలకు సర్వం సిద్ధం

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 18 నుంచి జరుగు పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు సర్వ సిద్ధం చేసినట్లు ఎంఈవో రవీంద్ర నాథ్ మంగళవారరం తెలిపారు. మండలంలో ఐదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, మూడు ప్రవేట్ పాఠశాలల్లో 398 మంది విద్యార్థులు పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు వ్రాయనున్నట్లు తెలిపారు. మంగళవారం ప్రశ్నాపత్రాలు రాగా పోలీసుస్టేషన్‌లో అధికారులు భద్రపరిచారు.

చదువుల తల్లి విగ్రహం ఏర్పాటు



దాతలను సన్మానిస్తున్న దృశ్యం

వరదయ్యపాళెం, మార్చి 12: మండలంలోని కారిపాకం జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం చదువుతల్లి సరస్వతి దేవి విగ్రహాన్ని పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వేనాటి ఆనంద్ మాట్లాడుతూ ఉన్నత పాఠశాలలో సరస్వతీదేవి విగ్రహం ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలోవిద్యాకమిటీ చైర్మన్ మునస్వామి, ప్రజలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండుతున్న అడవి



ఏర్పేడు, మార్చి 12: మండల కేంద్రానికి సమీపంలో ఉన్న కొండల్లోని అడవుల కు మంగళ వారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో దావానలంలా వ్యాపించాయి. గుర్తు తెలియని వ్యక్తులు అడవుల్లో దొరికే కందమూలాల కోసం వెళ్లిన సమయంలో బీడీలు కాల్చివేయడంతో నిప్పు అంటుకుని ఉంటుందని అటవీశాఖ అధికారులు తలిపారు. మంటలను అదుపు చేస్తున్నామన్నారు. వేసవిలో ఎక్కువ అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు తగుచర్యలు తీసుకోవాల్సి ఉంది.

ఆరుగురు 'ఎర్ర' స్మగ్లర్ల అరెస్టు



మంగళం, మార్చి 12: చంద్రగిరి సమీపంలోని భాకరాపేట అటవీప్రాంతంలో గొడ్డళ్లు, రంపాలతో చొరబడుతున్న ఆరుగురు ఎర్రచందనం స్మగ్లర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఆర్ఐ సురేష్ కుమార్ రెడ్డికి చెందిన ఏఆర్ ఎస్ఐ మహేశ్వర నాయుడు టీమ్ భాకరాపేట అనంతపురం హైవేలోని ఓ ప్రైవేటు కాలేజ్ ఎదురుగా ఉన్న అడవుల్లో కూంబింగ్ చేపట్టారు. అక్కడ కొందరు వ్యక్తులు అడవుల్లోకి చొరబడుతుండగా చుట్టుముట్టారు. పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేయగా, ఆరుగురిని పట్టుకున్నారు. వీరిని సత్యసాయి జిల్లాకు చెందిన ఆనేవాళ్ళ హరి (43), తిరుపతి రూరల్‌కు చెందిన మురుగయ్య (27), తమిళనాడు కళ్లకురిచ్చికి చెందిన వేల్ మురుగన్ (46), ఏలుమలై (46), మురుగన్ తంగవేల్ (37), మహేంద్రన్ మురుగేషన్ (46)లుగా గుర్తించారు. తప్పించుకున్న మరో ఆరుగురు కోసం గాలిస్తున్నారు. పట్టుబడ్డ వారి నుంచి మూడు బస్తాల్లో గొడ్డళ్లు, రంపాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసు స్టేషన్‌లో నమోదు చేయగా సీఐ శ్రీనివాసులు దర్యాప్తుచేస్తున్నారు.

వైసీపీ ఓటమే లక్ష్యం: నెలవల

తడ, మార్చి 12: వైసీపీని ఓడించి టీడీపీ ప్రభుత్వాన్ని గద్దెనెక్కించడమే ప్రతి కార్యకర్త లక్ష్యంగా భావించాలని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక పార్టీ కార్యాలయంలో మండల స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ నాయకుల దౌర్జన్యాలు, అక్రమాలకు కాలం చెల్లే రోజులు దగ్గరపడ్డాయన్నారు. మాజీ మంత్రి పరసా రత్నం మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదించేందుకు అందరూ కలసికట్టుగా పనిచేయాలని కోరారు. సమావేశంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నెలవల విజయశ్రీ, జిల్లా కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బొమ్మన శ్రీధర్, అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, నాయకులు సెల్వం, శివాజీ, బొమ్మన పళణి, రమేష్, సుధాకర్, జీవ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను గెలిపించండి



ప్రచారంలో చింతా మోహన్

తడ, మార్చి 12: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్ అన్నారు. మంగళవారం తడ, అక్కంపేటల్లో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రతి నిరుపేద కుటుంబానికీ ఇందిరమ్మ అభయహస్తం పథకం ద్వారా రూ.5వేలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చందన మూడి శివ, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

గూడూరు, మార్చి 12: స్థానిక మినీ గురుకులంలో మంగళవారం రోటరీవెస్ట్‌క్లబ్ ఆధ్వర్యంలో ఎస్‌వీ రత్నం చారిటీస్ సహకారంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్లు రోహిణి, గంగాధర్‌రెడ్డి, నారాయణ, సత్యశ్రీ ఆధ్వర్యంలో విద్యార్థినిలకు దంత, కంటి, ఇతర వైద్య పరీక్షలను నిర్వహించారు. ఎస్‌వీ రత్నం చారిటీస్ అధ్యక్షుడు శ్రీకంటి రామమోహన్‌రావు, సనత్‌కుమార్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, నాశిన నాగులు, గిరిబాబు, సిద్దారెడ్డి, రాజ్యలక్ష్మి, శ్యామ్‌సుందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా కార్యదర్శిగా నాగయ్య

చిల్లకూరు, మార్చి 12: గూడూరు నియోజకవర్గ ఓబీసీ మోర్చా కార్యదర్శిగా చిల్లకూరు మండలంలోని తూర్పుకనుపూరు గ్రామానికి చెందిన మిద్దె నాగయ్యను నియమించినట్లు బీజేపీ నాయకులు తెలిపారు.

కొండ బస్సుల్లో నిషేధాల తరలింపుపై విచారణ !

తిరుపతి అర్బన్, మార్చి 12: వైసీపీ సిద్ధం సభకు జనాన్ని తీసుకెళ్లిన బస్సులు నిషేధిత పదార్థాలతో తిరుమలకు చేరిన సంఘటనపై ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి విచారణకు ఆదేశించినట్లు సమాచారం. తిరుమల పవిత్రత దెబ్బతినేలా వ్యవహరించారంటూ డిపో మేనేజర్ స్థాయి అధికారితో విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని కోరారు. సభ నుంచి తిరుగుముఖం పట్టిన సమయంలోనే డ్రైవర్లకు తిరుపతిలోనే బస్సులను శుభ్రం చేసి కొండకు తీసుకురావాలని ఫోన్ ద్వారా తిరుమల డిపో మేనేజర్ సూచించారు.అయినా పట్టించుకోకుండా బస్సులను తిరుమలకు తెచ్చిన డ్రైవర్లను సమగ్రంగా విచారించనున్నారు. ఈ ఘటనతో తిరుమల ఘాట్‌లో నడిచే సప్తగిరి బస్సులను ఇకపై ఆధ్యాత్మిక, పుణ్యక్షేత్రాల ప్రయాణాలకు మినహా ఇతర కార్యక్రమాలకు, ప్రధానంగా రాజకీయ ప్రచారాలకు ఉపయోగించకూడదన్న నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.66 కోట్లు

తిరుమల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.66 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయం లభించినట్టు మంగళవారం ఉదయం ప్రకటించింది. ఇక, సోమవారం 64,802 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 21,695 మంది తలనీలాలు సమర్పించారు.

ఈద్గా, అయ్యప్ప పూజకు

స్థల కేటాయింపును ఎమ్మెల్యే అడ్డుకున్నారు

మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ



టీడీపీ నేతలతో కలిసి మీడియాతో మాట్లాడుతున్న రఫీ

నాయుడుపేట, మార్చి 12: ముస్లింల ప్రార్థనా స్థలం ఈద్గాకు 2 ఎకరాలు, అయ్యప్పస్వామి పూజకు ఎకరా భూమిని కేటాయించేందుకు సీఎంవో నుంచి అనుమతులు తీసుకువస్తే ఎమ్మెల్యే సంజీవయ్య అడ్డుకున్నారని మున్సిపల్ వైస్ ఛైర్మన్, టీడీపీ నేత షేక్ రఫీ ఆరోపించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసీపీలో ఉన్నప్పుడు తాను స్వార్థం లేకుండా దాదాపు రూ.5 కోట్ల సొంత డబ్బు ఖర్చుపెట్టి పనిచేస్తే తీవ్ర అవమానాలే ఎదురయ్యాయన్నారు. ఇసుక, మట్టి మాఫియా నాయకులకే ప్రాధాన్యం దక్కిందన్నారు. టీడీపీ మతతత్వ పార్టీతో పొత్తు పెట్టుకుందని పెళ్లకూరుకు చెందిన ఓ సీనియర్ నాయకుడు వ్యాఖ్యానించడం విడ్డూరంగా ఉందన్నారు. వైసీపీ, బీజేపీతో రహస్య ఒప్పందాలు పెట్టుకొని ఎన్ఆర్‌సీ, సీఏఏ బిల్లులకు మద్దతు తెలపలేదా అని ప్రశ్నించారు. పెళ్లకూరు పెద్దాయన టీడీపీలోకి వస్తే సాదరంగా ఆహ్వానిస్తామని, వైసీపీలో ఉండే గొడవలు, కొట్లాటలు తప్పిపోతాయని హితవు పలికారు. కార్యక్రమంలో న్యాయవాది పసల చెంగయ్య, పృథ్వీ, నిజాం, ముస్లిం మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ షరీఫ్, ఖలీల్ పాల్గొన్నారు.

జిల్లాస్థాయి రెజ్లింగ్ జట్టు ఎంపిక



తిరుపతి(క్రీడలు), మార్చి 12: శ్రీనివాస క్రీడా సముదాయంలో మంగళవారం జిల్లాస్థాయి అండర్-20 రెజ్లింగ్ జట్టును ఎంపిక చేశారు. జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా క్రీడాకాధికారి సయ్యద్‌సాహేబ్, ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వై.ప్రవీణ్, ఆర్.శ్రీధర్ హాజరయ్యారు.

జట్టు వివరాలిలా..

బి.సాయితేజ, ఎ.హేమంత్, ఎన్.గోపి, కె.భార్గవ్‌నందకుమార్, పి.సుమన్, టి.మహేష్, ఎ.అనంద్, డి.లీలామోహన్, పృథ్వి, ఎన్.జ్యోతిప్రకాష్, పి.కార్తీక్, ఎస్.మహేష్, ఎ.నాగరాజు, బి.రాజేష్ ఉన్నారు. వీరంతా ఈనెల 20, 21 తేదీల్లో చిత్తూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రాతినిథ్యం వహిస్తారని అసోసియేషన్ కార్యదర్శి ఉదయ్‌కుమార్ తెలిపారు.

ఏసీబీ డీఎస్పీగా రవిమనోహరాచారి



తిరుపతి క్రైం, మార్చి 12: తిరుపతి ఏసీబీ డీఎస్పీగా రవిమనోహరాచారి నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం తిరుపతి ఎస్పీ, ఏసీబీ కార్యాలయానికి ఉత్తర్వులు అందాయి. గతంలో ఈస్ట్ సీఐగా, తిరుమల, తిరుపతి ఎస్బీ డీఎస్పీగా, మదనపల్లె డీఎస్పీగా కూడా పనిచేశారు. అక్కడి నుంచి పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురానికి బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఉమ్మడి చిత్తూరు జిల్లాకు తిరుపతిలో ఉన్న ఏసీబీ కార్యాలయానికి డీఎస్పీగా బదిలీపై వస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. గతంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పలు చోట్ల పనిచేసిన అనుభవం ఉందన్నారు. శ్రీవారి పాదాల చెంత పనిచేయడం అదృష్టంగా భావిస్తానని చెప్పారు.

ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వహించాలి: కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 12: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో నోడల్ అధికారులు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి లక్ష్మీశ ఆదేశించారు. మంగళశారం కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్‌తో కలిసి అధికారులకు పలు సూచనలిచ్చారు. డీఆర్వో పెంచలకిషోర్, ఎన్నికల సూపరింటెండెంట్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దగ్ధమైన రేషన్ వాహనం తనిఖీ

ఏర్పేడు, మార్చి 12: మండలంలోని ఎండీపుత్తూరు గ్రామంలో మంగళవారం సోమవారం రాత్రి షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమైన నిత్యావసర సరుకుల వాహనాన్ని సీఎస్ డీటీ తిరుమలేశ్వరి పరిశీలించారు. రేషన్ సరఫరా చేసే వ్యక్తితో మాట్లాడి మంటలకు గల కారణాలను ఆరా తీశారు. కార్యక్రమంలో వీఆర్వో రవి, బియ్యం పంపిణీదారు మహేష్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఇల్లుదగ్ధం

వరదయ్యపాళెం, మార్చి 12: వరదయ్యపాళెం మండలం సీఎల్ఎన్ పంచాయతీలోని తూర్పు హరిజనవాడలో పోలమ్మ, భర్త మునస్వామి మధ్యాహ్నం 1.30గంటల ప్రాంతంలో టీవీ చూస్తుండగా ఒకసారిగా విద్యుదాఘాతం తలెత్తింది. దీంతో తాటాకులతో కూడిన ఇల్లు అంటుకుని పూర్తిగా దగ్ధమైంది. సుమారు రూ.లక్ష మేర నష్టం వాటిల్లిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా పక్కనే ఉన్న గడ్డివాములోని 70కట్టలు తగలబడిపోయిందని రైతు వాపోతున్నాడు.

పేకాటరాయుళ్ల అరెస్టు

నాగలాపురం, మార్చి 12: మండల పరిధిలోని రాజుల కండ్రిగ గ్రామం వద్ద పేకాడుతున్న ఆరుగురిని నాగలాపురం పోలీసులు అరెస్ట్ చేశారు. దీనికి సంబంధించి నాగలాపురం ఎస్ఐ ఓబయ్య వివరాల మేరకు.. ఆ గ్రామంలోని పొలాల వద్ద వెంకటయ్య, బాస్కర్, జయచంద్రారెడ్డి, శ్రీను, గోపీ, బాలాజీ కలిసి మంగళవారం మధ్యాహ్నం పేకాడుతుండగా నాగలాపురం ఎస్ఐ ఓబయ్య, హెడ్‌కానిస్టేబుల్ రాధాక్రిష్ణ, సాయి క్రిష్ణ, కేశవులు కలిసి దాడి చేసి వారినుంచి 5,100 రూపాయలు స్వాధీనం చేసుకుని, వారిని అరెస్ట్ చేసి కేసునమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సత్యవేడు: మండలం పుదుకుప్పం గ్రామ సమీపంలోని మామిడి తోటలో పేకాడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.7,980లు నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వీరాంజనేయులు తెలిపారు. ఈ దాడుల్లో గ్రామానికి చెందిన అశోక్, శేఖర్, జానకిరామన్, శ్రీనివాసులు అరెస్టు చేసి కేసు నమోదు చేశామన్నారు.

10మద్యం సీసాలు స్వాధీనం

ఏర్పేడు, మార్చి 12: మండలకేంద్రంలో పది మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ జిలానీ తెలిపారు. ఆయన కథనం మేరకు తమకు అందిన సమాచారం మేరకు మండల కేంద్రంలో గాలి సుబ్బరామయ్య దుకాణంలో పది మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేశారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు



ప్రవచనం చేస్తున్న బ్రహ్మశ్రీ విభీషణ శర్మ

మహిమాన్వితం ముక్తి క్షేత్రం

శ్రీకాళహస్తి, మార్చి 12: ముక్తి క్షేత్రమైన శ్రీకాళహస్తి ఎంతో మహిమాన్వితమని బ్రహ్మశ్రీ విభీషణ శర్మ చెప్పారు. శ్రీకాళహస్తీశ్వరాలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ధూర్జటి కళా ప్రాంగణంలో మంగళవారం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఇందులో భాగంగా తిరుపతికి చెందిన ఆధ్యాత్మికవేత్త విభీషణ శర్మ భక్తులకు శ్రీకాళహస్తి ప్రాశస్త్యంపై ప్రవచనం చేశారు. మనిషి నిత్య జీవితంలో ఆధ్యాత్మిక చింతన ఎంతో అవసరం అన్నారు. అంతకు ముందు పలువురు కళాకారులు చేసిన శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. విజయవాడకు చెందిన వీవీఏ ప్రసాద్ భక్తి రంజని సభికులను మైమరిపించింది. శ్రీకాళహస్తికి చెందిన సుజాత బృందం ప్రదర్శించిన యోగాసనాలు ఆకట్టుకున్నాయి. కళాకారులను ఆలయ అధికారులు ఘనంగా సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

భక్తులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న టీడీపీ నాయకులు సత్రవాడ ప్రవీణ్, ఎస్సీవి దిలీప్

శ్రీకాళహస్తి, మార్చి 12: శ్రీకాళహస్తిలో మంగళవారం జరిగిన గిరిప్రదక్షిణలో భాగంగా దాతలు పెద్ద ఎత్తున భక్తులకు అన్నదానాలు చేశారు. ఇందులో భాగంగా శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యేలు సత్రవాడ ముని రామయ్య, ఎస్సీవి నాయుడు కుమారులు సత్రవాడ ప్రవీణ్, ఎస్సీవి దిలీప్ సంయుక్తంగా సుమారు 1000 మందికి అన్నదానం, వాటర్ బాటిళ్ల వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మునిశేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో భాగంగా కైలాస గిరి ప్రదక్షిణకు భారీగా తరలివచ్చిన భక్తుల ఆకలి తీర్చేందుకు బుధవారం పలువురు దాతలు ముందుకొచ్చారు. ఆయా గ్రామాలకు చెందిన రైతులు, సేవకులు, కుల సంఘాలు, సంక్షేమ సంస్థలు, వెయ్యి లింగాల కోన సమీపంలోని స్వయంభు ఆశ్రమ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

ముస్లింల సంక్షేమానికి పెద్దపీట

శ్రీకాళహస్తి, మార్చి 12 : దివంగత బొజ్జల గోపాలకృష్ణారెడ్డి హయాంలో ముస్లింల సంక్షేమానికి పెద్దపీట వేశారని ఆయన హయాంలో శ్రీకాళహస్తి నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందని బొజ్జల బృందమ్మ స్పష్టం చేశారు. రంజాన్ మాసం సందర్భంగా పట్టణంలో మంగళవారం ఇఫ్తార్ విందు అందజేశారు. పట్టణ మైనార్టీ అధ్యక్షుడు మహమ్మద్ షఫీ, రాష్ట్ర మైనారిటీ కార్యనిర్వాక కార్యదర్శి షాకీర్ అలీ, టౌన్ బ్యాంకు మాజీ ఛైర్మన్ డీవీ నారాయణ, మాజీ డైరెక్టర్ ఖాదర్ బాష, ఖలీల్, చాన్‌బాషా, ఖాదర్ వలీ, ముజీఫ్, ఖాళీల్ బాషా, చాన్ భాష తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు వేయకుండానే నిధుల స్వాహా

వరదయ్యపాళెం, మార్చి 12: రోడ్డు వేయకుండా నిధులు స్వాహా అయిన విషయం వరదయ్యపాలెం మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని ముస్లింపాళెం నుంచి విజ్ఞాననగర్ వరకు వేయాల్సిన మట్టిరోడ్డు వేయకుండానే అధికారపార్టీ నాయకులు నిధులు స్వాహా చేశాడు. 15వ ఆర్థికసంఘం నుంచి రూ.14లక్షల వ్యయంచూపించి రూ.11లక్షలు మేర నిధులు స్వాహా చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులు నీటికి, కరెంటుకు అత్యవసరాలకు మాత్రమే వాడాల్సి ఉంది. అయితే అధికార పార్టీ నాయకులు మాత్రం తామేమి చేసినా చెల్లిపోతుందనే ఉద్దేశ్యంతో మట్టి రోడ్డు వేయకుండానే డబ్బు తినేశారు. ఇప్పుడు విషయం బయటపడుతుందోనని మట్టి తోలేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారని ప్రజలు అనుకుంటున్నారు. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి మండలంలో అవినీతి అక్రమాలు జరగకుండా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారు.

ముక్కంటి సేవలో తెలంగాణ ఎమ్మెల్సీ

శ్రీకాళహస్తి, మార్చి 12: శ్రీకాళహస్తీశ్వరాలయానికి తెలంగాణ ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ మంగళవారం విచ్చేశారు. ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. దక్షిణామూర్తి సన్నిధిలో ఆయనకు ఆలయాధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

ఏర్పేడు, మార్చి 12: టీడీపీ అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జల సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషితారెడ్డి అన్నారు. ఏర్పేడు మండలంలోని పంగూరులో మంగళవారం ప్రచారం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని ఆదరించాలన్నారు. టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సిపాయి భరోసా అందజేత



ఏర్పేడు, మార్చి 12: మండలంలోని బండివాని పల్లిలో రమేష్ అనే వ్యక్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ రష్ ఆస్పత్రి అధినేత డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం అక్కడికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి సిపాయి భరోసా కింద ఏడాదికి సరిపడ 42 రకాల నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంకటాద్రి, రాము, మూర్తి, పెరుమాల్, విజయ, చంద్రశేఖర్, రమణయ్యయాదవ్, ఎంపీపీ గీత, రమణయ్య, హరిబాబు, అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

రేణిగుంట, మార్చి 12: స్థానిక రైల్వేస్టేషన్ ఆవరణంలోని రైల్వే పార్కులో గుర్తు తెలియని ప్రయాణికుడు చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం ఉదయం బుకింగ్ ఆఫీస్ పక్కన చోటు చేసుకుంది. రేణిగుంట అర్బన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రైల్వే బుకింగ్ కార్యాలయం పక్కన ఉన్న పార్కులో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడని, బ్లూజీన్స్, తెల్ల రంగు షర్టు ధరించి ఉన్నాడని అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని రైల్వే పోలీసులు తెలపడంతో మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

రాజరాజేశ్వరి ఆశ్రమాన్ని సీజ్ చేయాలి: ఐద్వా



రేణిగుంట, మార్చి 12: రాజరాజేశ్వరి ఆశ్రమాన్ని సీజ్ చేయాలని ఐద్వా, ఎస్ఎఫ్ఐ మంగళవారం డీఎస్పీ భవ్య కిషోర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి డాక్టర్ పి.సాయిలక్ష్మి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి మాట్లాడుతూ 14ఏళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఆశ్రమ నిర్వాహకుడిని చట్టం ప్రకారం కేసు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు. కార్యక్రమంలో రాజేశ్వరి, ఈశ్వరి, సత్యశ్రీ, గిరిజ, ఎస్ఎఫ్ఐ నాయకులు శివ, సుభాన్, బాల తదితరులు పాల్గొన్నారు.

అత్యాచార నిందితుడి కోసం పోలీసుల గాలింపు

రాజరాజేశ్వరి జ్ఞానపీఠ స్వామి మూర్తి కోసం గాజులమండ్యం పోలీసులు తెలంగాణలో గాలింపు చర్యలు వేగవంతం చేశారు. ఇప్పటికే స్వామి స్నేహితులు, శిష్యులు, అతడితో దగ్గరగా మెలిగే వ్యక్తులను పోలీసులు ఆరా తీస్తున్నారు. అలాగే ఈ కేసు విషయంలో స్వామిని తప్పించాలని పోలీసు శాఖపై ఒత్తిడి పెరుగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

బ్రహ్మోత్సవాల్లో నేడు

- తీర్థవారి ధ్వజావరోహనం దేవరాత్రి (ఫాల్గుణ శుద్ధ చవితి, బుధవారం) ఉభయదారులు....

వాహన సేవలు

- ఉదయం 9గంటలకు కేడిగ వాహనసేవ
- రాత్రి 9గంటలకు సింహాసనం, కామధేనువు వాహనసేవ

నిత్యోత్సవాల వివరాలు

- ఉదయం 4.30గంటలకు: మంగళవాయిద్యాలు
- ఉదయం 5గంటలకు: గోపూజ, సర్వదర్శనం
- ఉదయం 5.30 గంటలకు: ప్రథమ కాల అభిషేకం
- ఉదయం 6.30 గంటలకు: ద్వితీయ కాల అభిషేకం
- ఉదయం 7.30గంటలకు పరివారదేవాలయాల నైవేద్యం
- ఉదయం 8.30 ఉచ్చికాల అభిషేకం
- ఉదయం 9గంటలకు స్వామి అమ్మవార్ల వసంతోత్సవం
- ఉదయం 10.15 నాగవల్లి మండపంలో స్వామి
- ఉదయం 11.30 నాగవల్లి మండపంలో త్రిశూలేశ్వర అభిషేకం
- సాయంత్రం 5గంటలకు: ప్రదోష కాల అభిషేకం
- సాయంత్రం 6.30గంటలకు ధ్వజావరోహనం
- రాత్రి 8గంటలకు: నైవేద్యం దీపారాధన
- రాత్రి 9 గంటలకు: స్వామి అమ్మవార్ల పురవీధి ఉత్సవం, త్రిశూల పల్లకి ఊరేగింపు
- రాత్రి 9.30గంటలకు దర్శనం ముగింపు
- ఉదయం 6 నుంచి సాయంత్రం 6గంటల వరకు రాహుకేతు సర్పదోష నివారణ పూజలు

హనుమంత వాహనంపై శ్రీనివాసుడు



శ్రీకాళహస్తి, మార్చి 12: శ్రీకాళహస్తి మండలం తొండమనాడులో టీటీడీ అనుబంధంగా వెలసి ఉన్న ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో వార్షిక ఉత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శ్రీవారు మంగళవారం హనుమంతవాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.

శివాలయంలో అన్నదానం



ప్రత్యేక అలంకారంలో స్వామి అమ్మవార్లు

ఏర్పేడు, మార్చి 12: మండలకేంద్రంలోని వరసిద్ధి వినాయక, కాశీ విశ్వేశ్వర స్వామి ఆయలంలో మహాశివ రాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. మంగళవారం 10.30గంటలకు స్వామివారి కల్యాణాన్ని ఆర్యవైశ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సర్పంచుల సంఘం అధ్యక్షుడు నల్లపాళెం శివయ్య, ప్రసన్న దంపతుల ఆధ్వర్యంలో వెయ్యిమందికి అన్నదానం చేవారు. రాత్రి వినాయకస్వామి, సుబ్రహ్మణ్యస్వామి, కాశీవిశ్వేశ్వరస్వామి, విశాలాక్షి అమ్మవార్ల ఊరేగింపు జరిగింది.

కోలాహలంగా ఎదురుసేవ





పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లు - అంజూరు వారి మండపం వద్ద భక్తజనం

శ్రీకాళహస్తి, మార్చి 12: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం శివపార్వతుల గిరిప్రదక్షిణ వేడుకగా జరిగింది. కైలాసగిరి ప్రదక్షిణ పూర్తిచేసుకుని తిరిగి వస్తున్న స్వామి అమ్మవార్లకు శుకబ్రహ్మాశ్రమ సమీపంలోని ఎదురుసేవ మండపం వద్ద ఆలయ అధికారులు, అర్చకులు, భక్తులు స్వామి అమ్మవార్లకు స్వాగతం పలికారు. మండపంలో స్వామి అమ్మవార్లకు సాంప్రదాయంగా పూజలు నిర్వహించారు. అంతకు ముందు భక్తులు పెద్ద సంఖ్యలో ఎదురు సేవా మండపం సమీపంలోని స్వర్ణముఖి నదిలో సందడి చేశారు. పిల్లలు, పెద్దలు కోలాహలంగా ఆట పాటలతో ఆనంద విహారంగా గడిపారు. కైలాసగిరి ప్రదక్షిణ ఆద్యాంతం ఆధ్యాత్మికత అనుభూతితో సాగే అడుగడుగునా సందడిగా జనం సాగిపోయారు. దారిపొడవునా చెట్ల నీడలో సేదతీరుతూ గడిపారు. విడిది మండపాల వద్ద దాతలు అందించే ఆహార, పానీయాలను భక్తులు స్వీకరించారు. అంజూరు వారి మండపం ఎదురుగా ఉన్న కైలాసగిరి రిజర్వాయరు వద్ద నీటిమట్టం అనువుగా ఉండటంతో పిల్లలు, పెద్దలు ఈత సరదాతో సందడిచేశారు. గిరిప్రదక్షిణ సందర్భంగా ముక్కంటి ఆలయ ఆధ్వర్యంలో భక్తులకు సేవలందించారు. అదేవిధంగా అంజూరు మండపం వద్ద అన్నదానం చేశారు.



పసుపు నీటితో స్వాగతం పలుకుతున్న మహిళలు

సైన్స్ పట్ల అవగాహన పెంచుకోవాలి



సర్టిఫికెట్లతో విద్యార్థులు

శ్రీకాళహస్తి, మార్చి 12: విద్యార్థులు చిన్నప్పటి నుంచే సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలని ఊరందూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజకుమారి పిలుపునిచ్చారు. గత నెల 28న పాఠశాలలో జాతీయ సైన్సు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఊరందూరు క్లస్టర్‌లో విద్యార్థులు పలు ప్రయోగాలను ప్రదర్శించారు. అందులో సృజనాత్మకంగా ఆకట్టుకున్న నమూనాలను కాకినాడలోని క్రియా ఫౌండేషన్ పంపినట్లు హెచ్‌ఎం తెలిపారు. అందులో భాగంగా క్లస్టర్ పరిధిలో మొదటి బహుమతి 7వ తరగతి విద్యార్థి జాహ్నవి, రెండవ బహుమతి 9వ తరగతి చదివే జాహ్నవి, మూడవ బహుమతి 8వ తరగతి విద్యార్థి శ్రీకర్ అందుకున్నట్లు వల్లెడించారు. గెలుపొందిన వారితో పాటు పాల్గొన్నవారికి విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సైన్సు ఉపాధ్యాయులు రమేష్ బాబు, శాంతి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం

- అడ్డుకున్న సీపీఎం



కబ్జాకు యత్నిస్తున్న వారిని అడ్డుకుంటున్న ఇంటిస్థలాల పోరాట సమితి

రేణిగుంట, మార్చి 12: తారకరామాననగర్‌లో ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నించడంతో సీపీఎం నాయకులు అడ్డుకున్న ఘటన మంగళవారం చోటు చేసుకుంది. సీపీఎం నాయకుడు, ఇంటి స్థలాల పోరాట కమిటీ అధ్యక్షుడు రాజశేఖర్ మాట్లాడుతూప్రభుత్వ అవసరాల కోసం తారకరామానగర్ శివాలయం ప్రాంతంలో రిజర్వ్ చేసిన భూమిని 12మంది మాకు పట్టాలు 2010లో ఇచ్చారని ఎమ్మెల్యే పేరు చెప్పి జేబీసీతో భూమిలోకి ప్రవేశించారన్నారు. దీంతో విషయం తెలుసుకుని తాము అడ్డుకున్నామన్నారు. వీఆర్వో అక్కడికి చేరుకుని పరిశీలించి రెవెన్యూ రికార్డులో లేని పట్టాలుగా నిర్ధారించారని తెలిపారు. ఇలాంటిచర్యలు పునరావృతం కాకుండా రేణిగుంట రెవెన్యూశాఖ స్పందించి ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. చంద్రమౌళి, జ్యోతిష, రాజు, అభిరామ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దారి దోపిడీ కేసులో నిందితుడికి జైలుశిక్ష

దారిదోపిడీ కేసులో నిందితుడికి తిరుపతి 1వ ఏజేసీజే కోర్టున్యాయమూర్తి రెండు సంవత్సరాలు జైలు శిక్ష విధించారు. పోలీసుల కథనం మేరకు రేణిగుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో 2019లో దారిదోపిడీ కేసులో నాయుడుపేటకు చెందిన వెంకటగిరి శ్రీరామ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. కోర్టు అతడికి మంగళవారం రెండేళ్ల జైలుశిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ తీర్పుఇచ్చింది.

బ్రహ్మోత్సవాలకు విరాళం



విరాళం అందజేస్తున్న బ్యాంకు అధికారులు

శ్రీకాళహస్తి, మార్చి 12:మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకి శ్రీకాళహస్తి కెనరా బ్యాంకు అధికారులు రూ.లక్ష చెక్కును ఆలయాధికారులు అందజేశారు. మంగళవారం ఆలయంలోని పరిపాలన భవనంలో కెనరా బ్యాంకు ఏజీఎం నాగరాజు, శ్రీకాళహస్తి బ్రాంచ్ మేనేజర్ జితేంద్ర ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఆలయ ఈవో నాగేశ్వరరావుకు చెక్కు అందజేశారు. ఆలయాధికారులు దాతలను సన్మానించారు. డిప్యూటీ ఈవో ఏకాంబరం తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి మహత్యం పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న ఎమ్మెల్యే తదితరులు

శ్రీకాళహస్తి, మార్చి 12: శ్రీకాళహస్తి మహత్య వచనం అనే పుస్తకాన్ని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. ధూర్జటి మహాకవి వచనాలను రచయిత జగన్నాధరావు పుస్తకంగా మలిచారు. ముక్కంటి ఆలయంలోని గురుదక్షిణామూర్తి వద్ద పుస్తకాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులతో, ఈవో నాగేశ్వరరావు, విజయవాడ దుర్గగుడి ఈవో రామారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ధర్మకర్తల మండలి సమావేశం

శ్రీకాళహస్తీశ్వరాలయ ట్రస్ట్‌బోర్డు సమావేశం బుధవారం ఉదయం నిర్వహించనున్నట్లు ఆలయ ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

శ్రీసిటీలో త్రిపుర విద్యార్థులు



శ్రీసిటీ, మార్చి 12: ఏక్‌భారత్-శ్రేష్ఠ్ భారత్ యువ సంగమం కార్యక్రమంలో భాగంగా త్రిపురకు చెందిన 45 మంది విద్యార్థులు, అధ్యాపకుల బృందం మంగళవారం శ్రీసిటీని సందర్శించింది. విద్యార్థులతో చర్చ గోష్ఠిలో శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ ఆటోమోటివ్, ఎలక్ట్రానిక్స్, ఎఫ్ఎంసీజీ, ఇతర వివిధ రంగాలకు సంబంధించి భారత్‌తో సహా 28 దేశాలకు చెందిన 210 పరిశ్రమలు ఇక్కడ ఉన్నాయని తెలిపారు. శ్రీసిటీ అధికారులతో పరస్పర చర్చా కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు అనంతరం పరిసరాలను చూశారు. ఈ ప్యాక్, అంబర్ పరిశ్రమలను సందర్శించి, అక్కడ ఉత్పత్తులు, పని వాతావరణం గురించి పరిశ్రమల అధికారులతో చర్చించారు.

ఇందిరానగర్ పంచాయతీలో అవకతవకలపై విచారణ



విచారణ జరుపుతున్న అధికారులు

వరదయ్యపాళెం, మార్చి 12: మండలంలోని ఇందిరానగర్ పంచాయతీలో పంచాయతీ లెక్కల్లో అవకతవకలు జరిగాయని ఆడిపూడి ఆషా అనే మహిళ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. 2016 నుంచి 2023 వరకు పంచాయతీ లెక్కలకు సంబంధించి సమాచార హక్కు చట్టం ద్వారా అందిన సమాచారంతో రూ.40లక్షల వరకు అవకతవకలు జరిగినట్లు గుర్తించి విచారణచేయాలని స్పందనలో కలెక్టర్‌కు వినతి అందజేశారు. స్పందించిన కలెక్టర్ మొదట డీఎల్‌పీవోను విచారణకు ఆదేశించారు. సంతృప్తి చెందని ఆషా మరోసారి కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో డ్వామా పీడీతో మరోసారి విచారణనకు కలెక్టర్ ఆదేశించారు. అర్జీదారు ఫిర్యాదులో పేర్కొన్న అధికారులను, గతంలో ఉన్న మాజీ సర్పంచ్ అప్పటి వైస్ సర్పంచ్ భర్త, ప్రస్తుత సర్పంచ్‌లను హాజరు కావాలని డ్వామా పీడీ శ్రీనివాస్ నోటీసులిచ్చారు. మంగళవారం ఇందిరానగర్ సచివాలయంలో జరిగిన విచారణకు సర్పంచ్ హాజరయ్యారు. మాజీ సర్పంచ్ అనారోగ్యంగా ఉందని, మరోసారి గైర్హాజరయ్యారు. సుమారు రూ.40లక్షలు అవకతవకలు, అర్థం కాని లెక్కలు, నగదు పుస్తకంలో ఖర్చులకు సంబంధించి వోచర్లు, ఎం.బుక్కుల్లో సంతకాలు టాలీ కాకపోవడం జీఎస్టీ అమల్లోకి వచ్చిన తరువాత కూడా టిన్ నెంబరు ద్వారా బిల్లులు చెల్లించడం, సీఎఫ్ఎంఎస్ ఖాతా నుంచి లబ్ధిదారులకు కాకుండా సొంత ఖాతాలకు నిధులు మళ్లించినట్లు గుర్తించారు.కాగా విచారణకు హాజరైన సర్పంచ్ అధికారుల ఎదుటే తనపై తప్పుడు వార్తలు రాస్తున్నారంటూ పరుష పదజాలంతో రెచ్చిపోయాడు. కవరేజ్‌కు వెళ్లిన ఓ విలేకరి ఫోన్ లాక్కుని ఏ ఆధారాలతో వార్తలు రాశావని బెదిరించాడు. విచారణ అధికారుల ముందే అర్జీదారులపై అభియోగదారుడు పరుష పదజాలంతో బెదిరింపులకు దిగడంపై అధికారులు చర్యలు తీసుకోవాలని అర్జీదారు ఆషా కోరారు. అందరి ముందు అరిస్తే నిజాలు అబద్ధాలు కాలేవని ఇందిరానగర్ పంచాయతీ నిధులు సుమారు రూ.40లక్షలు తిన్న వారికి శిక్ష పడే వరకు పోరాటం ఆగదన్నారు.